J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 46 సంచిక : 15 11.9.2026, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి




స్థానిక పోరులో..

# ఏకగ్రీవాలే లక్ష్యంగా కూటమి వ్యూహం!

- వీలైనన్ని ఎక్కువ చోట్ల పోటీలేకుండా గెలవాలి
- కూటమిలో పెద్దన్న పాత్ర పోషిస్తూనే సత్తాచాటాలి
- టీడీపీ శ్రేణులకు అధిష్టానం దిశానిర్దేశం
- క్షేత్రస్థాయిలో బలపడేందుకు జనసేన, బీజేపీ ఆరాటం

ఆంధ్రప్రదేశ్ స్థాని'కథ'ను మార్చే ఎన్నికలకు త్వరలోనే స్టేట్ ఎలక్షన్ కమిషన్ శ్రీకారం చుట్టనుంది. కోర్టు సమస్యలున్న చోట్ల మినహా మిగిలిన అన్ని చోట్ల మున్సిపల్, పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు నగరా మోగనుంది. ఇందులో వీలైనన్ని ఎక్కువ స్థానాలను ఏకగ్రీవంగా దక్కించుకోవాలని కూటమి పార్టీలు కసరత్తు ప్రారంభించాయి.

ఇందుకోసం మూడు పార్టీలు సమన్వయంతో వ్యవహరించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. కాగా అసెంబ్లీ ఎన్నికల సమయంలో తక్కువ సీట్లకు పరిమితమైన జనసేన, బీజేపీ ఈసారి తమ వాటాను మరింతగా పెంచాలని కోరుతున్నట్లు సమాచారం. అదే సమయంలో టీడీపీ సైతం క్షేత్రస్థాయిలో పట్టున్న స్థానాలను సంకీర్ణం పేరిట కోల్పోకూడదనే దృఢ చిత్తంతో ముందుకెళ్తున్నట్లు కనిపిస్తోంది. ఇక ఇటీవల జగన్ ఎక్కడా ఏకగ్రీవాలకు అవకాశం ఇవ్వకూడదని వైఎస్ఆర్ సీపీ శ్రేణులకు సూచించడం, ఆంధ్రప్రదేశ్‌లో రానున్న స్థానిక సమరం రసవత్తర యుద్ధంగా మారబోతోందనే విషయాన్ని తేటతెల్లం చేస్తోంది.

'ఢిల్లీకి రాజైనా.. తల్లికి బిడ్డే'. ప్రపంచాన్ని జయించినా జన్మస్థలంలో జయకేతనం ఎగురవేయడంలో ఉండే కిక్కే వేరు. ఈ ఉపోద్ఘాతమంతా రాష్ట్రంలో రానున్న స్థానికసంస్థల ఎన్నికల గురించే. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో జనం సార్వజనీన అభిప్రాయంతో ఓట్లు వేస్తారు. రాష్ట్ర భవిష్యత్, దేశ భవిష్యత్, జాతీయ రాజకీయాలు, విదేశీ వ్యవహారాలు, ఆర్థిక స్థితిగతులు వంటి అంశాల ప్రాతిపదికగా ఓ నిర్ణయానికి వస్తారు. ఈ మేరకు నచ్చిన నాయకులను

2లో




అన్నదాతల్లో పెరుగుతున్న ఆందోళన

## సెగలు పుట్టిస్తున్న.. ఎల్‌నినో

5లో

లాయర్‌ని బూతు మంత్రాలతో..

## ఆశీర్వదించిన వైసీపీ సామాజిక సైన్యం

5లో



## ఉత్తరక్రియలు

ఆదర్శమూర్తి, మా ఇంటి పెద్దదిక్కు

**శ్రీ ముడి జయరామిరెడ్డి గారు**

ఆగస్టు 27వ తేదీ, గురువారం పరమపదించారు.

వారి పవిత్ర ఆత్మ శాంతికై భగవంతుని ప్రార్థిస్తూ...

భార్య : ఇందిరమ్మ

కుమారుడు : ముడి శోభన్‌కుమార్‌రెడ్డి

కోడలు : హేమలత

| కుమార్తెలు : | అల్లుళ్ళు : |
|---|---|
| పద్మజ | కె. మధుసూధన్‌రెడ్డి |
| శైలజ | కె. చంద్రారెడ్డి |
| వసంత లక్ష్మి | పి. వివేకానందరెడ్డి |

మరియు : మనుమలు, మనుమరాళ్ళు
మునిమనుమలు, మునిమనుమరాళ్ళు

**ఉత్తరక్రియలు**

వారి పెద్దకర్మ తేది. 16.9.2026 బుధవారం ఉదయం 11.00 గంటలకు నెల్లూరు, మాగుంట లే అవుట్, 2వ మెయిన్, 2వ క్రాస్‌రోడ్డులోని వారి స్వగృహము నందు జరుగును. బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

# ఏకగ్రీవాలే లక్ష్యంగా కూటమి వ్యూహం!

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నుకుని చట్టసభలకు పంపిస్తారు. ఇక్కడ ఏ ఊరి నాయకుడు ఎన్నికవుతాడు. ఏ నేత ప్రభుత్వంలో కీలకపాత్ర పోషిస్తాడనే అంశం ప్రధానం కాదు.

కేవలం ఏ పార్టీ అధినేత ముఖ్యమంత్రి అవుతాడు, ఏ పార్టీ అధినేత కింగ్ మేకర్‌గా అయ్యే అవకాశం ఉందన్నదే కీలకాంశంగా ఉంటుంది. ఈ ప్రాతిపదికగానే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు జరుగుతుంటాయి. కానీ స్థానిక ఎన్నికల్లో అలా కాదు, మా కులం, మా మతం, మా కాలనీ, మా ప్రాంతం అనే క్షేత్రస్థాయి అంశాలు ముఖ్యపాత్ర పోషిస్తాయి. మా వాడు చక్రం తిప్పాలనే కోరిక, మాకు సంబంధించిన వ్యక్తి గద్దెనెక్కాలనే ఆశ స్థానిక ఎన్నికల్లో ఓటింగ్‌ను ప్రభావితం చేస్తుంటుంది. అందుకే ఇక్కడ పార్టీ గుర్తు, అధినాయకుడి కంటే క్షేత్రస్థాయిలో రోజూ మనతో కలిసి ప్రయాణించే కార్యకర్తే కీలకమవుతారు. అందుకే ప్రతిపార్టీ గ్రౌండ్‌లెవల్‌లో బలపడాలంటే పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల కంటే మించిన గొప్ప అవకాశం మరొకటి ఉండదని భావిస్తాయంటే అతిశయోక్తి కాదు. ఈ కారణంగానే పెద్ద, చిన్నా అనే తేడాలేకుండా ఎక్కడికక్కడ తమ జెండా పాతాలి అనే ఉద్దేశంతోనే అడుగులు ముందుకు వేస్తాయి. ఈ విషయం ఇంకా స్పష్టంగా అర్థం కావాలంటే ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ దేశంలో ఎక్కడ విజయకేతనం ఎగురవేసినా గుజరాత్‌లో సాధించే విజయం ఆయనకు ప్రత్యేకమనడంలో సందేహం లేదు. అలాగే దేశంలో ఎన్నిరాష్ట్రాల్లో హస్తం హవా చూపినా రాయ్‌బరేలిలో సోనియా కుటుంబం చాటే సత్తా రాహుల్‌గాంధీకి అంతులేని అనందాన్నిస్తుంది. సరిగ్గా ఇదే పరిస్థితి ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కనిపిస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ప్రతిపక్ష పార్టీ నాయకుడు వైఎస్ జగన్ కూడా రాష్ట్ర వ్యాప్తంగా తమ పార్టీ గెలవడంతో పాటు తమతమ స్వస్థలాలో క్షేత్రస్థాయి కార్యకర్తలు తిరుగులేని విజయం సాధించి సత్తా చాటాలని ప్రణాళికలు రచిస్తున్నారు. అందుకే పార్టీలో అగ్రనేతల నుంచి గ్రామస్థాయి నాయకుడి వరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్వశక్తులు ఒడ్డేలా దిశానిర్దేశం చేస్తున్నారు.

## టీడీపీలో కదనోత్సాహం!

ఏపీలో చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వంలో టీడీపీ, జనసేన, బీజేపీ కీలకపాత్ర పోషిస్తున్నా స్థానిక ఎన్నికల్లో టీడీపీకి వచ్చే సీట్లే కూటమి సత్తాకు ప్రాతిపదికగా విశ్లేషకులు, ప్రతిపక్ష పార్టీ నాయకులు సైతం భావిస్తారనడంలో ఏమాత్రం సందేహం లేదు. అందుకే టీడీపీ ఎన్నిచోట్ల విజయం సాధిస్తుంది, ఎన్నిచోట్ల ఏకగ్రీవం చేసుకుంటుంది, ఎన్నిచోట్ల తమ నాయకులను జెడ్పీ చైర్మన్లు, మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, సర్పంచ్‌లను చేస్తుంది. ఎన్ని జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను చేజిక్కించుకుందనే విషయమే రాష్ట్రరాజకీయాల్లో అంతిమంగా టాక్ ఆఫ్‌ద టౌన్ అవుతుంది. ఇక మిత్రపక్షాలు జనసేన, బీజేపీ కొన్నిచోట్ల విజయం సాధించినా టీడీపీ కార్యకర్తల బలం లేకుండా అది సాధ్యం కాదన్నది సుస్పష్టం. ఈ విషయాన్ని గుర్తెరిగే అధినేత చంద్రబాబు, యువనేత లోకేష్ తమ కార్యకర్తలకు స్థానిక ఎన్నికల్లో తమ పార్టీకి విజయం ఎంత అవసరమో పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. ఎంత మాత్రం అజాగ్రత్త తగదని హెచ్చరిస్తున్నారు. వ్యక్తులు, నాయకుల కంటే పార్టీనే ప్రధానం అనే విధానంతో ముందుకెళ్లాలని, రెబల్స్ పార్టీ లైన్‌ను దాటే సాహసం చేయొద్దని తేల్చి చెప్తున్నారు. ఈ క్రమంలో పార్టీ నిర్ణయాన్ని ధిక్కరించే వారిపై వేటు తప్పదని కూడా వారు కుండబద్ధలు కొడుతున్నారు. అందుకే లీడర్‌షిప్ కాన్‌క్లేవ్ పేరిట కార్యకర్తలతో సదస్సులు, నిజం గెలిచింది వంటి కార్యక్రమాలతో ఇంటింటికీ వెళ్లి టీడీపీ విజయాలను, సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను, చంద్రబాబుపై గతంలో జగన్ ప్రభుత్వం పెట్టిన కేసులు వాటి పర్యవసానాలను పూసగుచ్చినట్లు ప్రజలకు తెలియజేయాలని దిశానిర్దేశం చేస్తున్నారు. ఈ క్రమంలో రాష్ట్రంలోని మూడు కీలక ప్రాంతాలైన ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో ప్రత్యేక స్ట్రాటజీలతో ముందుకెళ్తున్నారు. ఇక రాష్ట్రవ్యాప్తంగా మెజారిటీ స్థానాల్లో టీడీపీ విజయం సాధిస్తుందనేది బహిరంగ రహస్యమే అయినా క్లీన్‌స్వీప్ అనేలా పరిస్థితి ఉండాలన్నది అధినేత ఆకాంక్షగా కనిపిస్తోంది. దీన్ని నిజం చేయడమే ధ్యేయమన్నట్లుగా టీడీపీ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో శ్రమిస్తే వారి పార్టీ తరపున పోటీచేసే అభ్యర్థుల విజయం నల్లేరుమీద నడకనే అని విశ్లేషకులు సైతం భావిస్తుండడం విశేషం!

## జనసేనలో బోలెడాశలు!

ఇక పుష్కరకాలంగా పార్టీని నడుపుతున్నా ఇంకా బలంగా వేళ్లూనుకోలేని స్థితిని జనసేన పార్టీ ఎదుర్కొంటోందన్నది జగమెరిగిన సత్యం. ఈ అపవాదును తొలగించుకుని తనకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించడమే ధ్యేయంగా స్థానిక ఎన్నికల్లో వీలైనన్ని స్థానాల్లో విజయకేతనం ఎగురవేయాలని ఆ పార్టీ అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పెద్దఎత్తున ప్రణాళికలు రచిస్తున్నారు. అందుకే గ్రామగ్రామానా జనసేన జెండా ఎగురవేయాలనే లక్ష్యాన్ని నిర్ణయించుకని వీలైనంతగా తమ కార్యకర్తల సంఖ్యను పెంచుకోవాలని, బూత్‌లెవల్‌లో పార్టీని బలోపేతం చేసుకోవాలని ఆయన వ్యూహం రూపొందిస్తున్నట్లు సమాచారం. ఈక్రమంలో పార్టీలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి సీట్ల సర్దుబాటు నుంచి బీఫారాలు, డిక్లరేషన్ ఫారాల వరకు అనునిత్యం పరిస్థితిని పర్యవేక్షించడం, కార్యకర్తలకు సూచనలు, సలహాలు ఇవ్వడంతో పాటు కొందరు నాయకులకు ప్రత్యేక బాధ్యతలను అప్పగించినట్లు తెలిసింది. ఇక బీజేపీ విషయానికొస్తే గతంలో అరశాతం ఓటింగ్‌కు కూడా నోచుకోని ఆ పార్టీ 2024 ఎన్నికల్లో అనూహ్య ఫలితాలతో గణనీయమైన సంఖ్యలో ఎమ్మెల్యే, ఎంపీ సీట్లను కైవసం చేసుకుంది. ఇది గాలివాటం కాదని తెలంగాణలోలాగే ఆంధ్రాలోనూ భవిష్యత్‌లో తమ పార్టీ ప్రత్యామ్నాయం అనేలా స్థానిక ఎన్నికల్లోనూ సత్తాచాటాలని ఆ పార్టీ అధిష్టానం తమ కార్యకర్తలకు స్పష్టమైన ఆదేశాలిచ్చినట్లు కనిపిస్తోంది. అందుకే పార్టీ రాష్ట్ర విభాగం అధ్యక్షుడు మాధవ్ తమకు పట్టున్న ప్రాంతాలు, అక్కడి నాయకుల స్థాయి, లభ్యమయ్యే మానవ వనరులు వంటి అంశాలపై దృష్టి సారించి పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో వీలైనన్ని చోట్ల తమ పార్టీ జెండా పాతాలని సమాయత్తం అవుతున్నట్లు తెలుస్తోంది.

## ఏటికి ఎదురీదైనా పోటీలో నిలవాల్సిందే!

ఇక ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ సైతం స్థానిక ఎన్నికలపై ఫోకస్ పెంచినట్లు కనిపిస్తోంది. ఇప్పుడు గ్రామస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించడం ద్వారా గత రెండేళ్లుగా డీలాపడిన కార్యకర్తల్లో కొత్త ఆశను చిగురింపజేయాలని ఆ పార్టీ అధినేత వైఎస్. జగన్ యోచిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. అందులో భాగంగానే అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా సమన్వయకర్తలు తమ పూర్తి బలం, బలగాన్ని స్థానిక ఎన్నికల బరిలో దింపాలని ఉదాసీనంగా వ్యవహరించి కూటమి పార్టీలకు ఏకగ్రీవమయ్యే అవకాశం ఇస్తే వచ్చే ఎన్నికల్లో సీటే ఉండదంటూ అతిపెద్ద హెచ్చరిక జారీ చేసినట్లు కనిపిస్తోంది. ఇప్పుడు ఈ వ్యాఖ్యలే కూటమి పార్టీలైన టీడీపీ, జనసేన, బీజేపీలో పట్టుదలను మరింత పెంచాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అందుకే వీలైనంతగా మున్సిపల్, పంచాయతీ స్థాయిలో ఏకగ్రీవాలు చేసి వచ్చే ఎన్నికల్లోనూ తమదే ఆధిపత్యం అనేలా గట్టి సంకేతాలను ప్రతిపక్ష పార్టీకి పంపాలని కూటమి పార్టీ అధినేతలు నిర్ణయించినట్లు సమాచారం.

మరి త్వరలో రానున్న స్థానిక ఎన్నికలు ఎవరికి మోదం.. ఏవరికి ఖేదం మిగుల్చుతాయో మరికొద్దిరోజుల్లో తేలిపోనుంది!

# గురునిలయంలో..16న వెంకయ్యస్వామి ఆరాధన

నెల్లూరు మూలాపేటలోని గురునిలయంలో ఈనెల 16న భగవాన్ శ్రీ వెంకయ్య స్వామివారి ఆరాధనా మహోత్సవం నిర్వహించనున్నట్లు వెంకయ్యస్వామి శిష్యులైన మాకాని వెంకట్రావుస్వామి కుటుంబసభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఈనెల 15న ఉదయం 8 గంటలకు స్వామివారి నామసంకీర్తన, భిక్షాటన కార్యక్రమాలు ఉంటాయని, సాయంత్రం 6 గంటలకి సాయిదర్బార్ అద్దాలమందిరం భక్తబృందం వారిచే భజన, సత్సంగం నిర్వహిస్తామని నిర్వాహకులు మాకాని గోపి తెలిపారు. 16వ తేది ఉదయం వెంకయ్యస్వామికి, శ్రీవారి పాదరేణువు మాకాని వెంకట్రావుస్వామికి అభిషేకం తదితర పూజలుంటాయని, మధ్యాహ్నం 11 గంటల నుంచి అన్నదానం, సాయంత్రం 6 గంటలకి శ్రీ విఘ్నేశ్వర నృత్యనికేతన్ చిన్నారుల నృత్యాలు, అనంతరం స్వామివారి నగరోత్సవం వైభవంగా నిర్వహిస్తామని వివరించారు.

### ధాన్యం కొనుగోలు

# కేంద్రాలు సిద్ధం

జిల్లాలో ఈ ఎడగారులో పండిన ధాన్యం కొనుగోలు చేసేందుకు జిల్లా వ్యాప్తంగా 81 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పౌరసరఫరాలశాఖ మేనేజర్ శ్రీని వాసులు ఈనెల 9న ఒక ప్రకటనలో తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటలలోనే ప్రభుత్వం రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేస్తుందని ఆయన పేర్కొన్నారు.

### నింగిలోకి దూసుకెళ్లిన..

# ఇస్రో విజయాస్త్రం!

## ○ జీఎస్ఎల్‌వీ-ఎఫ్ 17 విజయవంతం



భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మళ్ళీ చరిత్రాత్మక విజయం సాధించింది. దేశంలోనే తొలిసారిగా జియో సింక్రోనస్ కక్ష్య నుంచి భూమిని చిత్రీకరించే అత్యంత ఆధునికమైన ఇమేజింగ్ ఉపగ్రహం ఇఓఎస్–05 (ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్)ని దిగ్విజయంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. దీంతో ఇస్రో ప్రతిష్ట మరింతగా నింగినంటింది. ఈనెల 4న 2367 కిలోల బరువున్న ఈ ఉపగ్రహాన్ని జీఎస్ఎల్‌వి–ఎఫ్ 17 రాకెట్ ద్వారా శాస్త్రవేత్తలు నిర్ధేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. శ్రీహరికోటలోని రెండో ప్రయోగవేదిక మీదనుంచి శుక్రవారం వేకువన సరిగ్గా 2.55 గంటలకు జరిగిన ఈ ప్రయోగంలో, జీఎస్ఎల్‌వి–ఎఫ్17 రాకెట్ ఇఓఎస్–05 ఉపగ్రహాన్ని మోసుకుని, నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి దూసుకుపోయింది. సుమారు 18 నిమిషాల తర్వాత ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలోకి పంపినట్లు శాస్త్రవేత్తలు ప్రకటించడంతో దేశ వ్యాప్తంగా సంతోషం వెల్లువెత్తింది. తమ ప్రస్థానంలో అపజయాలెన్ని ఎదురైనా సంయమనంతో అధిగమించి అత్యద్భుతమైన విజయాలను సాధించే ఓర్పు–నేర్పు ఉన్న ఇస్రో శాస్త్రవేత్తలు, ఇస్రో ఛైర్మెన్ డా.వి. నారాయణన్ నేతృత్వంలో ఎంతో ప్రతిభాపాటవాలతో ఈ విజయాన్ని సాధించారు. ఈ సందర్భంగా నారాయణన్ మాట్లాడుతూ, ఈ విజయం భారత అంతరిక్ష పరిశోధనలో ఒక మేలి మలుపు అని, ఈ విజయం స్ఫూర్తితో ఈ ఏడాదిలో మరో ఆరు ప్రయోగాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలోనే శ్రీహరికోటలోని షార్ సెంటర్ నుంచి గగన్‌యాన్ తొలి మానవరహిత ప్రయోగంతో సహా ఆరుప్రయోగాలు నిర్వహించేందుకు సమాయత్తమవుతున్నామని చెప్పారు.

## దేశభద్రతకు ఎంతో కీలకమైన ఉపగ్రహం :

ఇఓఎస్–05 ఉపగ్రహం సమాచార సేకరణలోనూ, దేశభద్రత విషయంలోనూ ఎంతో కీలకమైనదిగా భావిస్తున్నారు. ఈ ఉపగ్రహానికి ప్రతి పది నిమిషాలకోసారి భారత ఉపఖండాన్నంతా చిత్రాలు తీయగలిగే సామర్థ్యం ఉంది. దేశ రక్షణ, విపత్తుల నిర్వహణలో దీనిని గేమ్‌ఛేంజర్‌గా కూడా భావిస్తున్నారు. సరిహద్దుల్లో శత్రుదేశాలు సైనికస్థావరాలను ఎంత రహస్యంగా దాచినప్పటికీ వాటిని పసిగట్టే సత్తా ఈ ఉపగ్రహానికి ఉంది. అంతేకాదు, వరదులు–తుఫాన్లు–కార్చిచ్చులు వంటి విపత్తులు వచ్చినప్పుడు వాటి తీవ్రతను గమనించి తగు సమాచారం అందజేస్తుంది. నిఘావ్యవస్థ, జాతీయ భద్రతావ్యవస్థలకు తోడ్పడేవిషయంలో ఇదెంతో కీలకంగా నిలుస్తుందని ఆశిస్తున్నారు.

### కాలధర్మం

# డాక్టర్ సులోచనమ్మ



ఒక్క నెల్లూరుజిల్లాలోనే కాకుండా చుట్టుపక్కల జిల్లాలలో సైతం ప్రముఖ చర్మ వ్యాధుల నిపుణులుగా ప్రసిద్ధులైన డాక్టర్ చెరుకూరు భాస్కర్‌రావు సతీమణి డాక్టర్ సులోచనమ్మ సెప్టెంబర్ 2వ తేదీ బుధవారం కన్నుమూశారు. ఆమె వయస్సు 76 సంవత్సరాలు. కాన్పులు మరియు గర్భకోశ వ్యాధుల నిపుణురాలిగా డాక్టర్ సులోచనమ్మ ప్రఖ్యాతిగాంచారు.

1951 మార్చి 4వ తేదీన నెల్లూరుజిల్లా కోవూరులో పోకూరి నరసింహారావు – శ్రీమతి సుబ్బమ్మ ముద్దుల తనయగా సులోచనమ్మ జన్మించారు. బాల్య విద్యాభ్యాసమంతా కోవూరులోనే పూర్తిచేశారు. తిరుపతిలోని పద్మావతి మహిళా కళాశాలలో ఇంటర్ చదివి అనంతరం అక్కడే శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుండి యం.బి.బి.యస్ పట్టా పుచ్చుకున్నారు. డిగ్రీ పొందిన అనంతరం గుంటూరు మెడికల్ కాలేజీలో గైనకాలజీ విభాగంలో యం.బి.బి.యస్ డీ.జీ.ఓగా నైపుణ్యత సాధించారు.

విద్యాభ్యాసం తరువాత 1977 డిసెంబర్ 15న సులోచనమ్మని డాక్టర్ భాస్కర్‌రావు వివాహమాడారు. నెల్లూరు ఆర్.ఆర్ స్ట్రీట్‌లోని నర్తకి సినిమాహాలు ఎదురుగా తన భర్త భాస్కర్‌రావు క్లినిక్ ప్రాంగణంలోనే సులోచనమ్మ కూడా 1981 నుండి ప్రాక్టీస్ మొదలుపెట్టారు. అనతికాలంలోనే ఆమె ప్రతిభావంతురాలైన వైద్యురాలిగా మహిళామణుల ప్రశంసలు అందుకున్నారు. సుదీర్ఘకాలం అక్కడే తమ వైద్య సేవలు కొనసాగించి కొన్ని సంవత్సరాల క్రితం తమ క్లినిక్‌ని నెల్లూరు మాగుంట లే–అవుట్‌కి మార్చారు. సులోచనమ్మ స్వతహాగా మృదుస్వభావి, సౌమ్యశీలి, అజాతశత్రువు. ముఖ్యంగా ఆరోగ్యం పట్ల నిత్యం అప్రమత్తంగా ఉండేవారు. క్రమం తప్పకుండా వీఆర్సీ మైదానంలో వాకింగ్‌కి వెళ్ళేవారు. 2014 వరకు సులోచనమ్మ మాగుంట లే–అవుట్‌లో తమ సేవలు కొనసాగిస్తూ తరువాత కాలంలో స్వల్ప అనారోగ్యానికి గురై ప్రాక్టీస్ నిలిపేశారు. మృత్యువుతో పోరాడి సెప్టెంబర్ 2న ఈ లోకాన్ని విడిచి వెళ్లిపోయారు. ఆమెకి భర్త భాస్కర్‌రావు, ఇద్దరు కుమారులు శ్రీనివాసరావు, ప్రవీణ్ ఉన్నారు. ఇంటి దీపాన్ని కోల్పోయి శోకసముద్రంలో ఉన్న భాస్కర్‌రావు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'

# అమ్మా అనిల్.. మైండ్ చెడిపోయిందా.. గతం మర్చిపోయావా?

### ➤ మాజీమంత్రి అనిల్‌యాదవ్‌పై ధ్వజమెత్తిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



*నీ గతం మర్చిపోయావా అనిల్. 2019లో ఎన్నికలు ముగియగానే మా ఇంటికి వచ్చావు, నన్ను, వేమిరెడ్డి ప్రభాకర రెడ్డిని శివపార్వతులు అన్నావు. నన్ను మీరే ఆదుకోవాలి అని భంగపడ్డావు. బికారినైపోయానని నంగి ఏడుపులు ఏడ్చావ్. మరి ఇప్పుడు కోట్ల రూపాయల ఆస్తులు నీకు ఎక్కడినుంచి వచ్చాయి? అంటూ కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి అనిల్ కుమార్‌యాదవ్‌పై విరుచుకుపడ్డారు. నెల్లూరులోని తమ కార్యాలయంలో గురువారం ఉదయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నీ జాతకం మా చేతుల్లో ఉంది.. తస్మాత్ జాగ్రత్త, నీ గురించి నిజాలు మాట్లాడితే తట్టుకోలేవ్ అంటూ హెచ్చరించారు. మెరుపుతీగ లాగా అప్పుడప్పుడూ మీడియా ముందుకు వచ్చి వేమిరెడ్డి దంపతుల మీద మాట్లాడితే నువ్వు పెద్ద నాయకుడివి అయిపోతానని అనుకుంటున్నావేమో? నీ నడక, నీ నడత, నీ వేషం, నీ బాష నేటి యువతకి, అన్ని పార్టీలలో ఉన్న రాజకీయ శ్రేణులకి అసలు నచ్చడం లేదు. నువ్వు మామీద ఎన్నిసార్లు ప్రెస్‌మీట్‌లు పెట్టి మాట్లాడితే, మా ఓటు బ్యాంకు అంత పెరుగుతుంది. ఆ విషయం గుర్తుపెట్టుకో.. అంటూ అనిల్‌కి చురకలంటించారు. పనిలో పనిగా ఆమె మరో మాజీమంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిపై కూడా విమర్శలు సంధించారు.*

పూర్తి వివరాల్లోకి వెళ్తే...

## అనిల్.. నీ గతం ఇదే...

అనిల్‌కుమార్‌యాదవ్ విశ్వాసఘాతుక రాజకీయాలకు చిరునామా అని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ధ్వజమెత్తారు. 2019 ఎన్నికల ఫలితాల రోజు సాయంత్రం అనిల్ తన చిన్నాన్న రూప్‌కుమార్‌ను వెంటబెట్టుకుని వచ్చి, 'మీరే శివపార్వతులు.. ఎన్నికల్లో ఓడిపోతే రోడ్డున పడతాను, నా దగ్గర రూపాయి లేదు' అని వేడుకున్న విషయాన్ని గుర్తుచేశారు. ఆనాడు దయతో ఆదుకున్న వీపీఆర్‌పైనే ఈరోజు నోరు పారేసుకోవడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. మంత్రి పదవి ఊడిపోయాక అనిల్‌కు మైండ్ పనిచేయడం లేదని, 2024 ఎన్నికల్లో నెల్లూరు ప్రజలు తన్ని తరిమేస్తే నర్సారావుపేటకు, అక్కడ కూడా తరిమేస్తే చెన్నైకి పారిపోయాడని ఎద్దేవా చేశారు.

## వీపీఆర్‌కు దందాల అవసరం లేదు!

వేమిరెడ్డి ప్రభాకరరెడ్డికి దేశవ్యాప్తంగా రూ.50 వేల కోట్ల విలువైన అధికారిక మైనింగ్ కాంట్రాక్టులు ఉన్నాయని, ఇంకా 35 ఏళ్లకు సరిపడా వ్యాపారాలు చేతుల్లో ఉన్నాయని చెప్పారు. సంపాదించిన తర్వాత ప్రజలకు సేవ చేయడానికి రాజకీయాల్లోకి వచ్చిన వీపీఆర్‌కు ఎలాంటి ఇల్లీగల్ దందాలు చేయాల్సిన అవసరం లేదన్నారు. నెల్లూరు యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతోనే 2024లో క్వార్ట్జ్ పరిశ్రమ దిశగా అడుగులు వేశామని, అయితే రాజకీయ రాద్ధాంతం ఇష్టం లేక 2025లోనే అధికారికంగా ఆ భాగస్వామ్యం నుంచి బయటకు వచ్చేశామని వివరించారు. ఈ రోజుకూ క్వార్ట్జ్ మైనింగ్ పేరిట అనిల్ యాదవ్ ఎవరెవరి దగ్గర ఎంతెంత దోచుకున్నాడో 76మంది బాధితుల జాబితా తన వద్ద ఉందన్నారు. ఇంకా ఎంతో మంది నష్టపోయారని చెప్పారు.

## మైనారిటీలకు అండగా నిలిచింది మేమే!

మైనారిటీల గురించి మాట్లాడే అర్హత అనిల్‌కు లేదన్నారు. మైనారిటీ నాయకుడు అజీజ్ మేయర్ కావడానికి వీపీఆర్ గారే సహాయం చేశారని తెలిపారు. ఖలీల్ అనే మైనారిటీ నేత డిప్యూటీ మేయర్ పదవిని తీసేసి, ఇప్పుడు తన కారు డోర్లు తీయడానికి పరిమితం చేసిన నీచ చరిత్ర అనిల్‌ది అని మండిపడ్డారు. మైనారిటీల సంక్షేమం కోసం మంత్రి నారాయణ రూ.30కోట్లు ఇస్తే, వీపీఆర్ రూ.14కోట్లు అధికారికంగా ఇచ్చారని, వారి పిల్లల చదువుల కోసం రూ.20 కోట్లతో పాఠశాల నిర్మిస్తున్నామని వివరించారు.

## దమ్ముంటే నీ బాబాయ్‌తో తేల్చుకో!

టీ అంగళ్ల దగ్గర చక్కర్లు కొడుతున్న నిన్ను చేయి పట్టుకుని రాజకీయంగా మంత్రి స్థాయికి తీసుకెళ్లింది మీబాబాయి రూప కుమార్ కాదా..? అని ప్రశాంతిరెడ్డి ప్రశ్నించారు. నీకు మీ బాబాయితో మనస్పర్థలు ఉంటే నేరుగా ఆయనతోనే తేల్చుకో, మధ్యలో నన్ను, వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని లాగడంలో నీ ఆంతర్యం ఏమిటో అర్థం కావడంలేదు. సీఎస్ఆర్ నిధులతో కార్యక్రమాలు చేస్తున్నామని ఆరోపించావు. మాకొచ్చే 3 కోట్ల సీఎస్ఆర్ నిధులు మేము చేసే కార్యక్రమాలకి ఒక మూలకి కూడా రావన్నారు. తాను ప్రజా సంక్షేమం కోసం ఒక్క కోవూరు నియోజకవర్గంలోనే నెలకి కోటి రూపాయలు ఖర్చుపెడుతున్నానని, అనవసరంగా తమ జోలికి రావద్దని హెచ్చరించారు. నీ చిట్టా విప్పితే తట్టుకోలేవ్ అమ్మా..అనిల్ అంటూ చురకలంటించారు.

## ప్రసన్న అక్రమ మైనింగ్‌పై విజిలెన్స్ విచారణ!

కోవూరు మాజీ ఎమ్మెల్యే ప్రసన్న కుమార్‌రెడ్డి తలమంచి, పంచేడు, రాజుపాలెం ప్రాంతాల్లో చేసిన ఇల్లీగల్ మైనింగ్‌పై ఇంటెలిజెన్స్ ఐజీ నివేదికలు సిద్ధంగా ఉన్నాయని, త్వరలోనే ఆయన అక్రమాల జాతకం బయటపడుతుందని హెచ్చరించారు. ఓ కాంట్రాక్టరును ఆత్మహత్య చేసుకునే పరిస్థితికి తెచ్చిన ఘనత ప్రసన్నదని, రూ.85 లక్షల బ్యాంకు స్కామ్ వెనుక ఉన్న మస్తానయ్య వ్యవహారం త్వరలోనే తేలుతుందన్నారు. ప్రస్తుతం కోవూరులో ఎలాంటి అవినీతికి తావులేదని, కలెక్టర్ సూచనల మేరకే నిబంధనల ప్రకారం పోతిరెడ్డిపాలెంలో ఇసుక అందుబాటులోకి తెచ్చామని స్పష్టం చేశారు.వైసీపీ నేతల అసత్య ప్రచారాలకు, కుట్రలకు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలే కోలుకోలేని దెబ్బతీస్తారని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి హెచ్చరించారు.

## అరెస్టు కోసం ఆరాటం పడుతున్నారు!

అటు అనిల్, ఇటు ప్రసన్న ఇద్దరూ మమ్మల్ని అరెస్టు చేయండి అంటూ సవాళ్లు విసురుతున్నారని, వీళ్ళు అరెస్టయితే తమ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి వచ్చి వీళ్ళని పరామర్శిస్తాడని.. వాళ్ళు ఆరాటపడుతున్నారని ప్రశాంతిరెడ్డి ఎద్దేవా చేశారు.






# నిజం గెలిచిందన్న నెల్లూరు నేతలు

### కొవ్వొత్తులతో ప్రదర్శనలు నిర్వహించిన తెదేపా నాయకులు



గత వైసీపీ ప్రభుత్వంలో 2023 సెప్టెంబరు 9వ తేదీన తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడును అక్రమంగా అరెస్టు చేసి జైలుకు పంపారని, అయితే ఆ తర్వాత 'నిజం గెలిచిందని' గుర్తుచేస్తూ, ఆరోజుకు గుర్తుగా ఈనెల 9న నెల్లూరులోని టీడీపీ కార్యాలయంలో కొవ్వొత్తులు వెలిగించి ప్రదర్శన నిర్వహించారు. మంత్రి నారాయణ, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, డిప్యూటి మేయర్ రూప్‌కుమార్ యాదవ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

అదే విధంగా ఢిల్లీలోని తన నివాసంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి చంద్రబాబునాయుడి 53 రోజుల అక్రమ నిర్బంధానికి గుర్తుగా 53 దీపాలను వెలిగించి, 'నిజం గెలిచింది' అని అన్నారు.

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తన కార్యాలయంలో కొవ్వొత్తులతో ప్రదర్శన చేపట్టారు. ఎమ్మెల్సీ మరియు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బీద రవిచంద్ర మరియు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



**అమరావతిలో ఈ నెల 10వ తేదీ గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన 8వ కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న నెల్లూరుజిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మరియు ఇతర జిల్లాల కలెక్టర్లు**



లాయర్
సెప్టెంబర్ 11, 2026

# ఏఐ నుంచి ఏజీఐ దాకా..ఆకాశమే హద్దుగా సాంకేతికత!

ప్రపంచం ఇప్పుడు ఆధునిక యుగంలో శరవేగంగా పరుగులిడుతోంది. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాలతో ఒకరికంటే మరొకరు పోటీపడుతూ విజ్ఞానగనులుగా ఆవిర్భవిస్తున్నారు. అణువు నుంచి అంతరిక్షం దాకా సాంకేతికతే విస్తరించేస్తున్న కాలమిది. ఏ రంగంలో చూసినా దానిదే కీలకపాత్ర. సాంకేతికత లేని రంగమే ఉండడం లేదు. సాంకేతికతతో ముందుకు పోతున్న దేశాలే అగ్రగాములుగా మారుతున్నాయి. అందులోనూ, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ రంగంలో నేటికాలంలో ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-కృత్రిమ మేధ) సాంకేతికతే సర్వత్రా విస్తరిస్తోంది. మనిషి చేయగలిగిన అనేక పనులని ఏఐ సాంకేతికత చేసిపెడుతోంది. మనకేం కావాలో అదే ఆలోచించి, ఏంచేస్తే బాగుంటుందో కూడా తెలుసుకుని, అన్నిటినీ అరటిపండు వొలిచి చేతిలో పెట్టినట్లు పెడుతోంది. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో అత్యంతాధునిక కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు, డ్రోన్లు వంటివి అన్ని రంగాల్లోనూ ప్రవేశించి ఎన్నో క్లిష్టమైన పనులను కూడా సునాయాసంగా అందుబాటులోకి తెస్తున్నాయి. ఏ సమాచారం కావాలన్నా అప్పటికప్పుడు అందించే యాప్‌లు, చాట్ జీపీజీలతో పాటు మరెన్నో సాంకేతిక సౌలభ్యాలను మనకందిస్తున్నాయి. సాంకేతికరంగంలో ఇప్పుడు ఏఐ ఒక దిగ్గజం. అదే మహారాజు.. దానికి తిరుగేలేదు అనుకుంటున్న సమయంలో, తాజాగా మరో సాంకేతిక రారాజు ప్రపంచం ముంగిట్లోకి అడుగుపెడుతోందన్న సమాచారం అందరిలోనూ మరింత ఉత్కంఠ రేపుతోంది. ఆ అధునాతన సాంకేతికత పేరే ఏజీఐ (ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్). సాఫ్ట్‌వేర్ రంగంలో ఇది ఇప్పుడు సంచలనాలు కాదు.. సరికొత్త ప్రకంపనలు సృష్టిస్తోంది కూడా. ఎందుకంటే, ఏఐ కంటే కూడా అసాధారణ ప్రతిభతో ఇది పనిచేస్తుందట. సాధారణ ప్రాంప్ట్‌ల ఆధారంగా వెబ్‌సైట్లు, యాప్‌లను ఇది కేవలం నిమిషాల వ్యవధిలోనే సృష్టించేస్తుందని, డెవలపర్లకు ఇది పనిభారాన్ని తగ్గించి కోడింగ్ ప్రక్రియని అత్యంత సులభంగానే మార్చేస్తుందని కూడా చెప్తున్నారు. అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా సందర్భానుసారం తగు నిర్ణయాలు తీసుకునే సత్తా..ఏజీఐకి ఉంటుందని భావిస్తున్నారు. సాంకేతికరంగ నిపుణులు. ఇటీవలే ఓపెన్ ఏఐ అధ్యక్షుడు గ్రెగ్ బ్యాక్‌మన్ జీపీటీ-6 ఆస్ట్రా మోడల్‌ని అభివృద్ధి చేసి విడుదల చేస్తూ, 'ఏజీఐ యుగానికి స్వాగతం' పలకడంతో ప్రపంచం 'ఔరా..ఇది నిజమేనా..ఏజీఐ వచ్చేస్తోందా'..అంటూ ఆశ్చర్యపోతోంది. ఏఐ టెక్నాలజీ తమకి కేటాయించిన నిర్దిష్టమైన పనులు మాత్రమే చేస్తుంది. కానీ అంతకుమించి మనిషిలాగే అది కూడా ఆలోచించి, మనకు అవసరమైన అనేకరకాల పనులు చేయడంలో ఏజీఐ పాత్ర రాబోయే రోజుల్లో కీలకం కాబోతోందని అంటున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే 'అదిగో..ఏజీఐ శకం రాబోతోందని' కూడా ఊహిస్తున్నారు. మన ప్రమేయం పెద్దగా లేకుండానే స్వయంగా కంప్యూటర్లను పనిచేయించడం, అంతర్జాలాన్ని శోధించడం, శాస్త్రీయపరమైన డేటాను తనంత తానే విశ్లేషించగలగడం, క్లిష్టమైన ప్రాజెక్టులని కోడింగ్ ప్రక్రియ ద్వారా క్షణాల్లో పూర్తిచేయడం వంటి అసాధారణ సామర్థ్యాలన్నీ ఏజీఐలో అందుబాటులోకి వస్తాయని చెప్తున్నారు. అంతేకాదు, తక్కువ సమయంలోనే, ఎక్కువ వేగంతో పనిచేసి అనుకున్న లక్ష్యాలను మనకందిస్తుందని, దీంతో రోజువారీ ఆధునిక డిజిటల్ జీవితం మరింత వేగవంతం అవుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. రాబోయే రోజుల్లో ఇది బాగా విస్తరించవచ్చని కూడా అనుకుంటున్నారు. ఏదేమైనా, మానవ మేధస్సు.. మానవ జీవితాన్ని ఇంతగా ప్రభావితం చేసే సాంకేతికతను కనుగొనడం ఎంతైనా ఆశ్చర్యకరమే. అయితే, ఏఐ నుంచి ఏజీఐ దాకా ఆకాశమే హద్దుగా సాంకేతిక విస్తరిస్తుంటే, ఇది ఇక్కడితో ఆగుతుందని, ఆగాలని కూడా ఎవరం అనుకోలేం! భవిష్యత్తులో ఇంకా ఒకదానికి మించి మరో సాంకేతికత దిగ్గజం పుట్టుకొస్తూనే ఉంటుంది. అయితే, మనదేశంలో ఇంకా సాంకేతిక పరిజ్ఞానం ఆశించిన స్థాయిలో విస్తరించడం లేదు. సాంకేతికపరంగా ఇప్పుడున్న ఈ వేగం చాలదు. రాకెట్ వేగంతో కాదు, రాకెట్‌కంటే కూడా వేగంగా పరుగులు తీయాలి. ఎంతటి ఆధునిక పరిజ్ఞానాన్నయినా ఇట్టే అవగాహన చేసుకుని సొంతంగానే మరిన్ని ఆవిష్కరణలు చేసే స్థాయికి మనదేశం ఎదగాలి. అంతేకాదు, దేశ ప్రగతికి, భవితకి కూడా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానమే శ్రీరామరక్ష అన్నది గ్రహించాలి. ప్రభుత్వాలు రానున్న ఇలాంటి సాంకేతిక విప్లవాలని ముందస్తుగానే గ్రహించి, సాంకేతిక పరిజ్ఞానాన్ని సామాన్యులకి కూడా అందుబాటులోకి తేవాలి. దానితోపాటు దేశభద్రత, ప్రకృతి విపత్తుల నివారణల కోసం కూడా ఇప్పటినుంచే మన ప్రభుత్వాలు సాంకేతిక బలంతో రాణిస్తూ.. మరింత పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాల్సి ఉంది.

## ఇదే తీరు కొనసాగితే చివరికి మిగిలేది వారిద్దరే!

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

గత వారం మన పత్రికలో వచ్చిన "చివరికి మిగిలేది వారిద్దరేనా..?" అనే మొదటిపేజీ కథనం ప్రస్తుత వైసీపీ రాజకీయ పోకడలకు అద్దం పట్టింది. ముఖ్యంగా జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయ నైజంలో ఇప్పటికీ పెద్దగా మార్పు రాలేదన్న రాజకీయ విశ్లేషకుల విశ్లేషణతో నేను ఏకీభవిస్తున్నాను. అధికారం కోల్పోయిన తర్వాత ఒక నాయకుడు తన తప్పులను విశ్లేషించుకుని, ప్రజలకు ఎందుకు దూరమయ్యానో ఆత్మపరిశీలన చేసుకోవాలి. కానీ జగన్ వ్యవహార శైలిలో మాత్రం ఆ మార్పు కనిపించడం లేదనే అభిప్రాయం ప్రజల్లో బలంగా ఉంది. అధికారంలో ఉన్నప్పుడు తన మాటే తుది నిర్ణయం అన్నట్టుగా వ్యవహరించడం, తన చుట్టూ ఉన్న వారి అభిప్రాయాలకు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వకపోవడం వంటి ఆరోపణలు అప్పట్లో వినిపించాయి. ఇప్పుడు అధికారం లేకపోయినా అదే ధోరణి కొనసాగితే రాజకీయంగా మరింత ఒంటరిగా మిగిలే ప్రమాదం ఉంది."చివరికి మిగిలేది వారిద్దరేనా..?" అన్న శీర్షిక అందుకే ఆలోచింపజేసింది. నాయకుడి పక్కన చేరి అయన చెవులో వున్నవి లేనివి చెప్పేవారు ఆ నాయకుడికి ప్రధానం కాకూడదు. క్షేత్ర స్థాయిలో ప్రజలు, తన గురించీ, తమ పార్టీ గురించీ ఏమనుకుంటున్నారు అన్నది చాలా ముఖ్యం. పార్టీ భవిష్యత్తుకి అదే కీలకం కూడా. రాజకీయాల్లో పరిస్థితులు మారుతాయి. కానీ నాయకుడి నైజం మారకపోతే పరిస్థితులు కూడా మారవు. జగన్‌మోహన్‌రెడ్డి ముందు ఇప్పుడున్న ప్రధాన సవాలు సజ్జలే..!

యం. చంద్రమౌళి, కొత్తఢిల్లీ.

## ఈ దారిని రెండు వరసల రహదారిని చేయండి!

సూళ్లూరుపేట – శ్రీకాళహస్తి రహదారి 2 వరుసలుగా అభివృద్ధి చేయవలసిన అవసరం చాలావుంది. ఇప్పుడు సూళ్లూరుపేట తిరుపతి జిల్లాలో ఉన్నందువలన సూళ్లూరుపేట, శ్రీహరికోట, దొరవారిసత్రంతో పాటు తడ మండలంలో కొన్ని గ్రామాల ప్రజలు జిల్లా కేంద్రమైన తిరుపతికి సూళ్లూరుపేట మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. స్థానిక సూళ్లూరుపేట, శ్రీ కాళహస్తి శాసనసభ్యులు ఇద్దరూ చొరవచూపించి సూళ్లూరుపేట–శ్రీకాళహస్తి దారిని రెండు వరసల రహదారిగా అభివృద్ధి చేయవలసినదిగా కోరుచున్నాను.

– కే. సుబ్రహ్మణ్యం, బాలాజీనగర్, నెల్లూరు.

## అమ్మో ఆటోలోళ్ళు!

నెల్లూరు నగరంలో ఆటోల స్పీడుకి, ఆగడాలకు అడ్డూ ఆపూ లేకుండా పోతుంది. ముగ్గురు ఎక్కాల్సిన ఆటోలో ఆరు లేదా ఏడు మందిని ఎక్కిస్తున్నారు. ఒక్కోసారి పదిమందిని కూడా ఇరికిస్తున్నారు. తమ ఆటోలని పుష్పక విమానాల్లాగా భావిస్తుంటారు. ఎక్కడపడితే అక్కడ రోడ్డుకి అడ్డంగా ఆపేస్తుంటారు. ఇక నెల్లూరు ఆటోవాలాలకి అసలు వన్‌వే అన్నపదానికి అర్థమే తెలియదు. ఎవరైనా వారి ఆగడాలని, ఆకృత్యాలని ప్రశ్నిస్తే రివర్స్‌లో వారిపైనే తిరగబడుతున్నారు. నెల్లూరు పోలీసు సూపరెండెంట్ మేడం గారు శ్రద్ధపెట్టాలి, ఆటోవాళ్ళ ఆగడాలతో పాటు అస్తవ్యస్తంగా వున్న నగర ట్రాఫిక్‌ని గాడిలోపెట్టాలి. – ఆర్.బి.సింగ్, గోమతీనగర్.

# స్వచ్ఛమైన గాలి పీల్చుకుందాం

మనసులో మాట 114

ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 7వ తేదీన ప్రపంచవ్యాప్తంగా జరుపుకొనే 'అంతర్జాతీయ స్వచ్ఛమైన వాయు దినోత్సవం' మనందరికీ ఒక నగ్నసత్యాన్ని అత్యంత స్పష్టంగా గుర్తుచేస్తుంది. గాలి అనేది కేవలం మానవాళి జీవించడానికి అవసరమైన మౌలిక సహజ వనరు మాత్రమే కాదు.. అది ఒక దేశపు సమగ్ర ఆరోగ్యం, ఆర్థిక పురోగతి. ప్రజల జీవన ప్రమాణాలకు నిజమైన కొలమానం. ఈ దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని భారతదేశంలో నిత్యం మనం ఎదుర్కొంటున్న వాయు కాలుష్య పరిస్థితిని లోతుగా పరిశీలిస్తే, ఆందోళన కలిగించే అంశాలతో పాటు కొంత ఆశాజనకమైన మార్పులు కూడా స్పష్టంగా కనిపిస్తున్నాయి. మన దేశంలో నానాటికీ వేగంగా పెరుగుతున్న పట్టణీకరణ, పారిశ్రామికీకరణ, మౌలిక వసతుల నిర్మాణాలు, రహదారులపై విపరీతంగా పెరిగిన వాహనాల రద్దీ మన పరిసరాల వాయు నాణ్యతపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ సవాలును అధిగమించడానికి భారత ప్రభుత్వం 2019లో ప్రవేశపెట్టిన 'జాతీయ స్వచ్ఛమైన వాయు కార్యక్రమం' ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఉన్న 130 ప్రధాన నగరాల్లో దీర్ఘకాలిక లక్ష్యాలతో అమలవుతోంది.

ఇటీవలి అధికారిక నివేదికలు, ప్రకటనల ప్రకారం 2017–18 ప్రారంభ స్థాయిలతో పోలిస్తే 2025–26 ఆర్థిక సంవత్సరం నాటికి దేశంలోని 108 నగరాల్లో ధూళి కణాల (PM10) స్థాయిలు గణనీయంగా తగ్గాయి. అందులో 72 నగరాలు కాలుష్య స్థాయిలను 20 శాతం కంటే ఎక్కువ తగ్గించగా, 26 నగరాలు ఏకంగా 40 శాతం కంటే ఎక్కువ తగ్గుదలను నమోదు చేసి ఇతర ప్రాంతాలకు ఆదర్శంగా నిలిచాయి. అంతేకాకుండా 14 నగరాలు జాతీయ వాయు నాణ్యత ప్రమాణాలను పూర్తిగా అందుకోగలిగాయి. ఈ బృహత్తర కార్యక్రమం కింద కేంద్ర ప్రభుత్వం కేటాయించిన రూ. 16,423.55 కోట్ల భారీ నిధుల్లో నగరాలు ఇప్పటివరకు సుమారు 70.5శాతం, అంటే రూ. 11,575.54 కోట్లను విద్యుత్ బస్సులు, రోడ్ల పై దుమ్ము నియంత్రణ, పచ్చదనం పెంపు, ఇతర మౌలిక వసతుల కోసం ఖర్చు చేశాయి. ఈ అంకెలు మనకు కొంత ఊరటనిస్తున్నప్పటికీ గాలి స్వచ్ఛత విషయంలో మనం సాధించాల్సింది ఇంకా చాలా ఉంది.

మన దేశంలో స్వచ్ఛమైన గాలి కోసం చేయాల్సింది ఇంకా చాలా ఉంది. వాయు కాలుష్యానికి నిర్దిష్ట భౌగోళిక సరిహద్దులు ఉండవు కాబట్టి, ఒక నిర్దిష్ట ప్రాంతంలో ఉత్పత్తయ్యే పొగ,దుమ్ము పొరుగు ప్రాంతాల గాలిని కూడా తీవ్రంగా కలుషితం చేస్తాయి. అందువల్ల కేవలం నగరాల పరిమితులకు మాత్రమే ప్రాధాన్యం ఇవ్వకుండా, భౌగోళిక ప్రాంతాల ఆధారంగా సమగ్ర వ్యూహాలను రూపొందించడం భవిష్యత్తు కార్యాచరణలో అత్యంత ముఖ్యం. నగరాల్లో ప్రజా రవాణాను పూర్తిగా ఎలక్ట్రిక్ వాహన వ్యవస్థగా మార్చడం, పారిశ్రామిక వ్యర్థ ఉద్గారాలను 'ఆన్‌లైన్ కంటిన్యువస్ ఎమిషన్ మానిటరింగ్' వ్యవస్థ ద్వారా ప్రతిక్షణం పర్యవేక్షించడం, వ్యర్థాలను బహిరంగంగా తగలేయకుండా శాస్త్రీయ పద్ధతుల్లో ప్రాసెసింగ్ చేయడం వంటి చర్యలు మరింత వేగవంతం కావాల్సి ఉంది. ఇక్కడ దేశం ఎదుర్కొంటున్న మరో ముఖ్యమైన సవాలు పంట వ్యర్థాలు. రైతులు పంట వ్యర్థాలను తగలబెట్టడం ద్వారా విపరీతమైన కాలుష్యం విడుదలవుతోంది. పంట వ్యర్థాలను మళ్లీ భూమికి ఎరువుగా మార్చే పద్ధతులపై రైతుల్లో మరింత అవగాహన పెంచాలి. దీనివల్ల భూమికి సారం అంది, భూమిలో కర్బనశాతం పెరగడంతో పాటు వాయు కాలుష్యం తగ్గుతుంది. వాయు కాలుష్యాన్ని నియంత్రించే లక్ష్యంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలను కఠినతరం చేయడమే కాకుండా, వాటి అమలును క్షేత్రస్థాయిలో నిరంతరం సమీక్షించాలి. నిధుల కేటాయింపుతో పాటు ప్రతి స్థానికసంస్థకు కచ్చితమైన లక్ష్యాలను నిర్దేశించడం అత్యవసరం. కేవలం కాంక్రీట్ భవనాలు, అద్దాల మేడలు నిర్మించడం మాత్రమే స్మార్ట్ సిటీ కాదని, పౌరులకు స్వచ్ఛమైన గాలిని అందించే నగరాలే నిజమైన స్మార్ట్ సిటీలనే ఆలోచన ప్రభుత్వాల ప్రాధాన్యతల్లో స్పష్టంగా ప్రతిబింబించాలి. మరోవైపు దేశంలోని విద్యాసంస్థలు వాయు కాలుష్యంపై కేవలం పాఠ్యపుస్తకాలలోని సిద్ధాంతాలకు మాత్రమే పరిమితం కాకుండా, విద్యార్థుల్లో ఆచరణాత్మక చైతన్యాన్ని రగల్చాలి. పాఠశాలలు, కళాశాలల ఆవరణల్లో వాయు నాణ్యత పర్యవేక్షణ పరికరాలను ఏర్పాటు చేసి, ప్రతిరోజూ గాలి నాణ్యతపై పిల్లలకు అవగాహన కల్పించడం, పరిసరాల్లో పచ్చదనాన్ని పెంచడం వంటి కార్యక్రమాలు చేపట్టాలి. వాయుకాలుష్యాన్ని అరికట్టడంలో దట్టమైన అడవులు కీలకపాత్ర పోషిస్తాయి కాబట్టి దట్టమైన అడవుల విస్తీర్ణం పెంచుకోవాలి. స్థానిక కాలుష్య సమస్యలకు తక్కువ ఖర్చుతో కూడిన పరిష్కారాలను కనుగొనేలా పరిశోధనలను ప్రోత్సహించడం ద్వారా భావి తరాలను ఈ పోరాటంలో భాగస్వాములను చేయవచ్చు.

ప్రభుత్వాలు ఎంత భారీగా నిధులు ఖర్చు చేసినా, ఎన్ని చట్టాలు తెచ్చినా పౌరులు, సమాజపు స్వచ్ఛంద భాగస్వామ్యం లేనిదే ఏ సామాజిక విప్లవమూ విజయవంతం కాదని గుర్తించాలి. మనం పీల్చే గాలి శుభ్రంగా ఉండాలంటే మన రోజువారీ జీవనశైలిలో చిన్న చిన్న మార్పులు చేసుకోవడం తప్పనిసరి. సొంత వాహనాల వినియోగాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించి ప్రజా రవాణాను ఉపయోగించడం, నడక, సైక్లింగ్‌ను ప్రోత్సహించడం, ఇళ్ల పరిసరాల్లో పచ్చదనాన్ని పెంపొందించడం, ప్లాస్టిక్ లేదా ఎండిన ఆకులను బహిరంగంగా తగలేసే అలవాటును పూర్తిగా మానుకోవడం ద్వారా ప్రతి పౌరుడు తన బాధ్యతను నెరవేర్చవచ్చు. స్వచ్ఛమైన గాలిని పీల్చడం మన హక్కు. అదే సమయంలో గాలి కలుషితం కాకుండా కాపాడుకోవడం ప్రతి ఒక్కరి ప్రాథమిక బాధ్యత.



- తుమ్మల బాల గంగాధర్ తిలక్

# సెగలు పుట్టిస్తున్న.. ఎల్‌నినో!



- సెప్టెంబర్‌లో సైతం తగ్గని ఎండ తీవ్రత
- నెల్లూరు జిల్లాకు మొండిచేయి చూపిస్తున్న వరుణుడు
- అన్నదాతల్లో పెరుగుతున్న ఆందోళన

సాధారణంగా ఏప్రిల్ మొదలైతే ఎండలు మండుతాయి. మే నెలలో తీవ్ర రూపం దాలుస్తాయి. జూన్ మొదటి పక్షంలోనో, నైరుతి రుతుపవనాల ప్రభావంతోనో వాటికి కాస్త ఉపశమనం లభిస్తుంది. కానీ ఈ ఏడాది మాత్రం కాలం మారినా కడగండ్లు తీరడం లేదు. సెప్టెంబర్ నెలలోకి అడుగుపెట్టినా సూర్యుడి ప్రతాపం తగ్గకపోవడం, మరోవైపు వరుణుడు ముఖం చాటేయడం నెల్లూరుజిల్లా ప్రజలను, ముఖ్యంగా అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తోంది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో అడపాదడపా వర్షాలు కురుస్తున్నప్పటికీ నెల్లూరుజిల్లాలో మాత్రం చినుకు లేకపోవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. భారత వాతావరణ శాఖ కూడా సెప్టెంబర్ తొలి వారంలో ద్వీపకల్ప భారతంలో వర్ష కార్యకలాపాలు బలహీనంగానే కొనసాగుతాయని పేర్కొంది.

## ఎల్‌నినో ప్రభావమేనా?

ప్రస్తుత వాతావరణ పరిణామాల వెనుక ఎల్‌నినో కీలక కారణాల్లో ఒకటిగా వాతావరణ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. పసిఫిక్ మహాసముద్రంలోని భూమధ్యరేఖ ప్రాంత సముద్ర జలాల ఉష్ణోగ్రతల్లో అసాధారణ పెరుగుదలతో ఏర్పడే ఈ సముద్ర వాతావరణ పరిణామం భారత నైరుతి రుతుపవనాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఎల్‌నినో బలపడినప్పుడు భారత రుతుపవనాలు సాధారణంగా బలహీనపడే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా రుతుపవనాల చివరి దశలో, అంటే సెప్టెంబర్‌లో వర్షపాతంపై దీని ప్రభావం మరింత స్పష్టంగా కనిపించవచ్చని వాతావరణ నిపుణులు చెప్తున్నారు. 2026 నైరుతి రుతుపవన కాలంలో దేశవ్యాప్తంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతుందని ఏప్రిల్‌లోనే ఐఎండి అంచనా వేసింది. మొత్తం సీజన్ వర్షపాతం దీర్ఘకాల సగటులో సుమారు 92శాతంగా ఉండవచ్చని కూడా పేర్కొంది. అంటే నెల్లూరులో కనిపిస్తున్న వర్షాభావ పరిస్థితికి పూర్తిగా స్థానిక పరిస్థితులు మాత్రమే కారణం కాదు. విస్తృత వాతావరణ వ్యవస్థలో చోటుచేసుకుంటున్న మార్పుల ప్రభావం కూడా దీనిపై ఉండే అవకాశం ఉంది.

## నెల్లూరుకే ఎందుకు ఇంత దెబ్బ?

అయితే ఇక్కడే అసలు ప్రశ్న. రాష్ట్రంలోని మరికొన్ని ప్రాంతాల్లో వర్షాలు పడుతున్నప్పుడు నెల్లూరులోనే ఎందుకు వరుణుడు ముఖం చాటేస్తున్నాడు? నెల్లూరు భౌగోళికంగా తూర్పు తీర ప్రాంతంలో ఉన్నప్పటికీ, దాని వ్యవసాయ పరిస్థితులు వర్షాల పంపిణీపై బాగా ఆధారపడి ఉంటాయి. ముఖ్యంగా చెరువులు, కాలువలు, భూగర్భ జలాలు, వర్షాధార సాగు ఇవన్నీ సమయానుకూల వర్షాలపై ఆధారపడి ఉంటాయి. ఒకటిరెండు భారీ వర్షాలు కురిసి మిగతా రోజులు పొడిగా ఉండటం కంటే, పంటలకు అవసరమైన సమయంలో విడతల వారీగా వర్షాలు పడటం ఎంతో ముఖ్యం. అదే సమయంలో వర్షం రాకపోతే నేలలో తేమ తగ్గిపోవడం, భూగర్భ జలాలపై ఒత్తిడి పెరగడం, సాగునీటి అవసరం పెరగడం వంటి సమస్యలు ఒకదాని వెంట ఒకటి వస్తాయి.

## ఓ వైపు ఎండ.. మరోవైపు వర్షాభావం

ప్రస్తుత పరిస్థితిలో అన్నదాతకు అసలు సమస్య ఇదే. వర్షం లేదు. ఎండ మాత్రం తగ్గడం లేదు. ఇది పంటలకు మరింత ప్రమాదకరం. నేలలో తేమ తగ్గిపోవడంతో పాటు ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే ఎక్కువగా ఉంటే పంటలపై నీటి ఒత్తిడి పెరుగుతుంది. మొక్కలు నీటిని ఎక్కువగా కోల్పోతాయి. సాగునీటి అవసరం పెరుగుతుంది. విద్యుత్ మోటార్లపై ఆధారపడే రైతులకు ఖర్చులు పెరుగుతాయి. ఇప్పటికే దేశవ్యాప్తంగా సెప్టెంబర్ వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉండటం వ్యవసాయంపై ఆందోళన పెంచుతోందని తాజా నివేదికలు కూడా సూచిస్తున్నాయి. పంటలు కీలక ఎదుగుదల దశలో ఉన్న సమయంలో సెప్టెంబర్ వర్షాలు చాలా ముఖ్యమని నిపుణులు చెప్తున్నారు.

## రైతన్నల ఆశలన్నీ ఆకాశంపైనే

రైతు విత్తనం వేసినప్పటి నుంచి పంట చేతికి వచ్చేవరకు ఆకాశం వైపే చూస్తాడు. ఈసారి కూడా అదే పరిస్థితి. వర్షం కోసం ఎదురుచూస్తూ ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన రైతుకు ప్రతి పొడిరోజు ఆందోళనను పెంచుతోంది. ముఖ్యంగా వర్షాధార ప్రాంతాల్లో పరిస్థితి మరింత సున్నితంగా మారుతోంది. వర్షం మరో పది రోజులు ఆలస్యమైనా పంటపై ప్రభావం పడవచ్చు. అదే వర్షం ఒక్కసారిగా కుండపోతగా కురిసినా అదీ సమస్యే. అందుకే ఇప్పుడు నెల్లూరు రైతుకు కావాల్సింది కేవలం భారీ వర్షం కాదు, సమయానుకూలమైన, విస్తారమైన, పంటకు ఉపయోగపడే వాన.

## ప్రకృతి హెచ్చరికను పట్టించుకోకపోతే?

ఎల్‌నినోను నిందించి చేతులు దులుపుకోవడం పరిష్కారం కాదు. వాతావరణ మార్పులు తరచూ ఇలాంటి అసాధారణ పరిస్థితులను సృష్టించే అవకాశం ఉన్న నేపథ్యంలో ముందస్తు ప్రణాళికలు చాలా అవసరం. జిల్లా యంత్రాంగం చెరువులు, సాగునీటి వనరుల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలి. తాగునీటి అవసరాలపై కూడా ముందస్తు అంచనా ఉండాలి. వ్యవసాయ శాఖ పంటల వారీగా రైతులకు వాతావరణ ఆధారిత సూచనలు ఇవ్వాలి. నీటి లభ్యతను బట్టి ప్రత్యామ్నాయ పంటలు, తక్కువ నీటితో సాగయ్యే పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలి. అన్నింటికంటే ముఖ్యంగా వర్షం ఎప్పుడు వస్తుందో ఎదురు చూడటం కంటే, వర్షం రాకపోతే ఏం చేయాలన్న దానిపై ముందుగానే కార్యాచరణ ఉండాలి.

ఎల్‌నినో ప్రభావం ప్రపంచవ్యాప్తంగా కనిపించే వాతావరణ పరిణామం కావచ్చు. కానీ దాని దెబ్బ మాత్రం స్థానికంగా, మన రైతు పొలంలో, మన చెరువులో, మన బావిలో కనిపిస్తుంది. అందుకే ఇప్పుడు నెల్లూరు జిల్లా ఎదుర్కొంటున్నది కేవలం ఎండ సమస్య కాదు. ఇది నీటి భద్రత, వ్యవసాయ భద్రత, రైతు ఆదాయం, భవిష్యత్ సాగుకు సంబంధించిన సమస్య. సెప్టెంబర్‌లోనైనా వరుణుడు కరుణించి జిల్లాపై జల్లులు కురిపిస్తాడా? లేక ఎల్‌నినో తన ప్రతాపాన్ని మరింత చూపిస్తుందా? అని అన్నదాత ఆకాశం వైపు ఆశగా చూస్తున్నాడు. చుక్క కోసం ఎదురుచూస్తున్న నెల్లూరు రైతుకు ఈసారి ఆకాశం నుంచి నేలపైపడే వానచుక్కే కావాలి తప్ప అది అన్నదాతల కన్నీటి చుక్క కాకూడదు..!

## లాయర్ ని బూతు మంత్రాలతో..
# ఆశీర్వదించిన వైసీపీ సామాజిక సైన్యం

గత వారం 'లాయర్' పత్రికలో 'చివరికి మిగిలేది వారిద్దరేనా?' అన్న శీర్షికతో వైయస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ పోకడపై వచ్చిన వార్తకి వైసీపీ సోషల్ మీడియా శ్రేణులు తీవ్రంగా స్పందించారు. వైసీపీ సామాజిక సైన్యం సామాజిక మాధ్యమాలలో రెచ్చిపోయారు. పత్రికలో రాయలేని భాషలో బూతు మంత్రాలతో 'లాయర్'ని ఆశీర్వదించారు. ఇది ఊహించిందే. వైసీపీ శ్రేణులు బూతులు వల్లించకపోతే అది వార్తవుతుంది తప్ప, వాళ్ళు బూతులు మాట్లాడితే అది వార్త కాదు. ఆ పార్టీ అగ్రనాయకుల దగ్గర నుండి క్షేత్రస్థాయి వరకు బూతులు మాట్లాడడం వారి సహజ నైజం. అది వారి డిఎన్ఏలో ఓ భాగం. స్పందించడం తప్పు కాదు. ఒక వార్త నచ్చకపోతే ఖండించవచ్చు. వాస్తవాలను చూపించి తప్పు అని నిరూపించవచ్చు. కానీ, పత్రికలో రాయలేని భాషలో బూతు మంత్రాలతో దాడి చేయడం మాత్రం రాజకీయ సంస్కృతికి నిదర్శనం కాదు. 'లాయర్'కి ఇది కొత్త అనుభవమేమీ కాదు. విమర్శ వచ్చిన ప్రతిసారీ విషయాన్ని పక్కనపెట్టి వ్యక్తులపై బూతులతో విరుచుకుపడటం కొందరి అలవాటుగా మారింది. అయితే, బూతులు తిట్టినంత మాత్రాన వార్తలోని వాస్తవాలు మారిపోవు. ప్రశ్నించిన అంశాలకు సమాధానం దొరకదు. ఇక్కడ ఒక విషయాన్ని స్పష్టంగా చెప్పాలి. 'లాయర్' ఏ వ్యక్తికీ కొమ్ముకాయదు. ఏ పార్టీకీ గొడుగు పట్టదు. ఏ పార్టీ జెండాను భుజాన వేసుకోదు. ఎక్కడ తప్పు కనిపిస్తే అక్కడ ప్రశ్నిస్తుంది. ఎక్కడ పొరపాటు జరుగుతుంటే అక్కడ సరిదిద్దుకోవాలని హెచ్చరిస్తుంది. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా దాని వైఖరిలో మార్పు ఉండదు.

2019-2024 మధ్య వైసీపీ అధికారంలో ఉన్న సమయంలోనూ 'లాయర్' ఆ పార్టీ విధానాలను, నాయకుల వ్యవహారశైలిని పలుమార్లు ప్రశ్నించింది. 'సర్వం సజ్జల మయం', 'మేలుకోకుంటే కోలుకోవడం కష్టమే' వంటి శీర్షికలతో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, వైసీపీ నాయకత్వానికి హెచ్చరికలు చేసింది. అప్పుడూ ఆ విమర్శలు అందరికీ నచ్చలేదు. కానీ, చెప్పాల్సిన విషయాన్ని చెప్పడంలో 'లాయర్' ఎప్పుడూ వెనుకడుగు వేయలేదు. నేడు అదే 'లాయర్' వైసీపీ రాజకీయ పరిణామాలపై ప్రశ్నిస్తే సోషల్ మీడియా సైన్యం ఆగ్రహించడం విడ్డూరం. వార్తకు సమాధానం చెప్పాల్సింది బూతులతో కాదు, వాస్తవాలతో. కథనంలో తప్పుంటే ఆధారాలతో ఖండించాలి. అభిప్రాయం తప్పైతే ప్రత్యామ్నాయ వాదనను ప్రజల ముందుపెట్టాలి. అంతేతప్ప వ్యక్తిగత దూషణలకు దిగడంవల్ల ప్రజల్లో చర్చ మరింత బలపడుతుంది.

నిజానికి ఒక పత్రికను తిట్టడం సులభం. కానీ, అది అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పడం కష్టం. 'లాయర్'ని బూతులతో ఆశీర్వదించిన సామాజిక సైన్యం ఒక విషయం గుర్తుంచుకోవాలి, తిట్లతో పత్రిక గొంతు నొక్కలేరు. ప్రశ్నించే కలానికి పార్టీ గీతలు ఉండవు. ఈరోజు వైసీపీని ప్రశ్నిస్తున్న 'లాయర్', రేపు మరో పార్టీని కూడా ప్రశ్నిస్తుంది. అదే జర్నలిజం. అదే 'లాయర్' విధానం.




# నెల్లూరు కబుర్లు

## నారాయణ సేవలను అభినందించిన విపిఆర్



ఉపాధ్యాయులతో మంత్రి నారాయణ, ఎంపీ విపిఆర్, వక్ఫ్‌బోర్డ్ చైర్మెన్ అజీజ్

చిన్ననాటి నుంచే విద్యకు, సేవా రంగానికి ప్రాధాన్యమిచ్చిన మంత్రి నారాయణ సేవలు అభినందనీయమని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి కొనియాడారు. నెల్లూరులోని డీవిఆర్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక మంత్రి పొంగూరు నారాయణ, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్‌తో కలిసి ఆయన పాల్గొని పాఠశాల ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ.. ఎంతోమంది పేద పిల్లలకు ఉచితంగా విద్యనందించి, వారి భవిష్యత్తుకు బాటలువేసిన గొప్ప వ్యక్తిత్వం మంత్రి నారాయణదని పేర్కొన్నారు. డివిఆర్, ఆర్‌విఆర్ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దడంలో ఆయన కీలకపాత్ర పోషించారని వెల్లడించారు.

## యాదవ భవన్‌లో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు



కృష్ణాష్టమి వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బీద రవిచంద్ర

జిల్లా యాదవ భవన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇటీవల శ్రీకృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ బీద రవిచంద్ర-జ్యోతి దంపతులు, డిప్యూటీ మేయర్ పోలుబోయిన రూప్ కుమార్‌యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీద రవిచంద్ర 'శ్రీ కృష్ణుని జీవన విధానం సమకాలీన మానవ జీవనానికి దిక్సూచి' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. యుగాలు మారినా, తరాలు గడచినా, సమాజంలో ఎన్ని మార్పులు వచ్చినా శ్రీ కృష్ణుడు చూపిన మార్గం ఎన్నటికీ అనుసరణీయమని ఆయన అంటూ, కమిటీ సభ్యులకు అభినందనలు తెలియజేశారు.

## గురువు స్థానం అత్యున్నతమైనది



గురువులని సత్కరిస్తున్న అరుణమ్మ

భారతీయ సంస్కృతిలో గురువుకు అత్యున్నతమైన స్థానం ఉందని, "ఆచార్యదేవోభవ" అనే మాట గురువు యొక్క ప్రాధాన్యతను తెలియజేస్తుందని జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ చెప్పారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సెప్టెంబరు 5వ తేదీన నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన సమావేశమందిరంలో ఏర్పాటైన గురుపూజోత్సవంలో ఆమె జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లతో కలిసి పాల్గొన్నారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు సాధించిన గురువులకు అభినందనలు తెలిపారు.

## కొత్త పింఛన్లుకు..
## 16 వరకు అవకాశం

ఎన్టీఆర్ భరోసా కొత్త పింఛన్ల నమోదుకు ఈనెల 16వతేదీ వరకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి ఈనెల 7న ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని స్వర్ణ, గ్రామ, వార్డుల్లో అర్హులైన వారు తగు పత్రాలు సమర్పించి తమ పేర్లు నమోదు చేసుకోవచ్చని వివరించారు.

## పోలీసులకు..
## సాంకేతిక ల్యాబ్!

జిల్లాలోని పోలీసు సిబ్బందిలో సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించేందుకు జిల్లా శిక్షణా కళాశాలలో కొత్తగా ల్యాబ్‌ని ఏర్పాటు చేశారు. అందులో 35 కంప్యూటర్లతో సిబ్బందికి సాంకేతిక వినియోగంలో శిక్షణ అందిస్తారు. ఈ ల్యాబ్‌ని ఈనెల 7న జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ప్రారంభించారు. 176 మంది పోలీసులు ఇక్కడ శిక్షణ పొందుతున్నారు. ల్యాబ్ ప్రారంభోత్సవంలో ఏఎస్పీ సౌజన్య, డీఎస్పీలు గిరిధర్, ఘట్టమనేని శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, రమణకుమార్, ఇన్స్‌పెక్టర్ నాగేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నేత్రదానంపై ర్యాలీ

నేత్రదానం వల్ల మరొకరికి చూపును ప్రసాదించవచ్చని నెల్లూరులోని ఏసీసుబ్బారెడ్డి ప్రభుత్వ కళాశాల వైద్యులు, విద్యార్థులు ఈనెల 7న నెల్లూరు నగరంలో ర్యాలీ నిర్వహించారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా ఈ అవగాహన ప్రదర్శన నిర్వహించారు. మరణానంతరం నేత్రదానం చేయడం మానవతా దృక్పథంతో చేసే మంచి కార్యమని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరి చెప్పారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ మరణానంతరం నేత్రదానం చేయాలి, తద్వారా అంధులకు చూపును ప్రసాదించగలమని తెలిపారు. నేత్ర విభాగం ప్రొఫెసర్ డాక్టర్ వసంత, డాక్టర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో తొలిసారిగా 11న..
# 'మహాలక్ష్మి దీపోత్సవం'



నెల్లూరులో మొట్టమొదటిసారిగా నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సౌజన్యంతో, నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఈనెల 11న 'మహాలక్ష్మి దీపోత్సవం' కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించనున్నామని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. శ్రావణ మాసంలోని చివరి శుక్రవారం ఎంతో విశిష్టమైనదని, ఆ పవిత్రమైన రోజున మహాలక్ష్మి అమ్మవారిని పూజించి దీపాలు వెలిగించడం ద్వారా అమ్మవారి కటాక్షం లభిస్తుందని ఆమె అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి అందించే మహాలక్ష్మి అమ్మవారి విగ్రహాన్ని స్టేడియానికి తీసుకువచ్చి అంకురార్పణ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు, లక్ష్మీదేవి పూజ నిర్వహిస్తామని చెప్పారు. పూజల అనంతరం వేలాదిమంది మహిళలతో కలిసి మహాలక్ష్మి అమ్మవారికి దీపాలు వెలిగించే కార్యక్రమం ప్రారంభమవుతుందని, జిల్లాలోని మహిళలందరూ ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆమె కోరారు.

## గ్రామీణ విలేకర్లకు శిక్షణా తరగతులు




గ్రామీణ విలేకరులకి సర్టిఫికెట్‌లని అందజేస్తున్న ఆలపాటి సురేష్, దయాశంకర్

నెల్లూరులో ఇటీవల రెండు రోజులపాటు జర్నలిస్టుల పునశ్చరణ తరగతులు జరిగాయి. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, సిఆర్ మీడియా అకాడమీ ఛైర్మెన్ ఆలపాటి సురేష్‌కుమార్ పాల్గొని జిల్లాలోని జర్నలిస్టులకు తమ సందేశాలనిచ్చారు. ఈ తరగతుల్లో విన్న అంశాలను ఆచరణలో పెట్టి జర్నలిస్టులుగా మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. పునశ్చరణ తరగతుల ముగింపు సభలో ఆలపాటి మాట్లాడుతూ, జర్నలిజానికి సంబంధించిన పలు అంశాల్లో నిష్ణాతులైన సీనియర్ జర్నలిస్టులు, ఫాకల్టీ సభ్యులు ద్వారా పునశ్చరణ తరగతులు నిర్వహించామని, పూర్తి క్రమశిక్షణతో రెండు రోజులు జరిగిన తరగతుల్లో పాల్గొని విజయవంతం చేసినందుకు నెల్లూరు గ్రామీణ విలేఖరులకు ధన్యవాదాలు తెలిపారు. ముగింపు కార్యక్రమంలో నెల్లూరు సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ వేణుగోపాల్, నెల్లూరు విశాలాంధ్ర బ్యూరో ఛీఫ్ కె.దయాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్‌లో హెడ్మాస్టర్ల రక్తదానం

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల ప్రధానోపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో నెల్లూరు మండల పరిధిలోని అనేక మంది హెడ్మాస్టర్లు, అధికారులు రక్తదానం చేశారు. నెల్లూరు రెడ్‌క్రాస్ కార్యా లయంలోని రక్తనిధి (బ్లడ్‌బ్యాంక్)లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏపీహెచ్ఎంఏ ప్రధాన కార్యదర్శి ఆర్.మురళీధర్, కోశాధికారి బుజ్జయ్య, విడవలూరు ఎంఇఓ అంకయ్య, ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఎస్.నరసింహమూర్తి, బ్లడ్‌బ్యాంక్ మాజీ కన్వీనర్ అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా
## రెడీ చేయండి

జిల్లా పరిషత్, మండల పరిషత్‌ల పాలకవర్గాలకు ఈనెల 24వ తేదీతో గడువు ముగియనున్న నేపథ్యంలో, స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఎన్నికలకు సమాయత్తం కావాలని, ఓటర్ల జాబితాను ముందుగానే సిద్ధం చేసుకోవాలని ఎన్నికల కమిషన్ ఆదేశించడంతో, జిల్లాలోనూ ఆమేరకు ఏర్పాట్లకు సన్నాహాలు చేస్తున్నారు. మారిన జిల్లా పరిషత్ పునర్వ్యవస్థీకరణకు అనుగుణంగా ఓటరు జాబితా ఉండాలని పేర్కొన్నారు. పంచాయతీల నుంచి ఓటరు జాబితాను తీసుకుని, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల కోసం మండలాలవారీగా సిద్ధం చేసి, ఈనెల 11న ప్రతి మండలంలోనూ ఓటరు జాబితాను ప్రచురించాలని కూడా ఆదేశించారు.

## వేదాయపాలెం
## సీఐగా కోటేశ్వరరావు

నెల్లూరులోని వేదాయపాలెం పోలీస్‌స్టేషన్ ఇన్స్‌పెక్టర్‌గా చిట్టెం కోటేశ్వరరావు ఈనెల 7న బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న కె.శ్రీనివాసరావును రేంజ్ కార్యాలయానికి బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి తాజాగా ఉత్తర్వులిచ్చారు. కోటేశ్వరరావు జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్‌లలో పనిచేసిన అనుభవం ఉంది. బుచ్చిరెడ్డిపాళెంతో పాటు, డీటీసీలోనూ, సీసీఎస్, చిన్నబజారు, సంతపేట పోలీస్‌స్టేషన్‌లలో ఆయన విధులు నిర్వహించి ఉన్నారు. కొత్తగా వేదాయపాలెం సీఐగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు పోలీస్‌స్టేషన్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## నెల్లూరు రూరల్‌కి
## కొత్త సీఐ

నెల్లూరు రూరల్ సీఐగా ఉన్న జి.వేణు బదిలీ అయ్యారు. ఆ స్థానంలో వెంకటరెడ్డి ఈనెల 7న బాధ్యతలు చేపట్టారు. కొత్త సీఐగా వచ్చిన వెంకటరెడ్డికి పోలీస్‌స్టేషన్ సిబ్బంది, పలువురు పోలీసు అధికారులు శుభాకాంక్షలు చెప్పారు.

## బాలాజీనగర్‌లో
## పోలీసుల తనిఖీలు

నేరనియంత్రణలో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాలతో పోలీసులు ఇటీవల నెల్లూరులోని బాలాజీనగర్ పరిధిలోని శ్రామికనగర్‌లో ఇంటింటి తనిఖీలు చేపట్టారు. ఇళ్లల్లో ఉన్న వారి వివరాలను సేకరించారు. పత్రాలు సరిగాలేని 20 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఓ అనుమానితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐలు విజయ్ శ్రీనివాస్, సూర్యప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.






## 12వ తేదీ కల్లా.. గణేష్ ఘాట్‌లో ఏర్పాట్లు



ఏర్పాట్లని పరిశీలిస్తున్న కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి

వినాయకచవితి వేడుకలకు నెల్లూరు నగరంలో చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. 41వ డివిజన్‌లో గణేష్‌ఘాట్‌లో జరుగుతున్న పనులను ఇటీవల అధికారులతో కలిసి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి మరియు విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పరిశీలించారు. ఈనెల 12వ తేదీకల్లా ఏర్పాట్లు పూర్తవుతాయని వారు తెలిపారు. నెల్లూరు నగర, రూరల్ నియోజకవర్గం నుంచే కాకుండా కోవూరు, సర్వేపల్లి ప్రాంతాల నుంచి కూడా గణేష్ నిమజ్జనానికి వచ్చే భక్తులు ఎవ్వరూ ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మాజీ మేయర్ భానుశ్రీ, విష్ణు ప్రియ, వినోద్‌రెడ్డి, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# స్వర్ణభారత్ ట్రస్ట్ సేవా ప్రస్థానం..ఆదర్శనీయం!

## ○ కొనియాడిన యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్



***గూ**ండాల గుండెల్లో సింహస్వప్నం.. రౌడీలు, అరాచకవాదుల పీచమణిచే వీరసింహం..మరెవరో కాదు..ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్. దేశంలో సంచలనం కలిగించే సాహసోపేతనిర్ణయాలతో అవినీతి–అక్రమార్కులను గడగడలాడిస్తూ ప్రజల అభిమానం పొందుతున్న బీజేపీ అగ్రనేతల్లో ఒకరైన యోగి ఆదిత్యనాథ్.. తొలిసారిగా నెల్లూరుజిల్లాకు రావడం ఒక అపూర్వమైన విషయం. భారత పూర్వ ఉప రాష్ట్రపతి..భారతమాత ముద్దుబిడ్డ.. మన వెంకయ్యనాయుడి మానసపుత్రిక అయిన స్వర్ణభారత్ ట్రస్ట్‌కు ఆయన విచ్చేయడంతో ఆ ప్రాంగణానికే కాదు, జిల్లాకే ఒక కొత్త కళ వచ్చినట్లయింది. జిల్లాలోని అనేకమంది నాయకులు, ప్రముఖులు ఆయన్ను చూసేందుకు, ఆయన అద్భుతమైన ప్రసంగం వినేందుకు కుతూహలంతో స్వర్ణభారత్‌కి విచ్చేశారు. సింహపురి గడ్డపై అడుగుపెట్టిన యోగి ఆదిత్యునికి జిల్లాలోని ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు సాదరంగా పుష్పమాలికలతో స్వాగతించారు.*

భారత పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడి ఆలోచనలతో పాతికేళ్ల క్రితమే ఏర్పాటైన స్వర్ణభారత్ సేవా ట్రస్ట్ జిల్లాకే కాదు, దేశానికే గర్వ కారణంగా ఉంటున్న విషయం అందరికీ తెలిసిందే. గత 25 సంవత్సరాలుగా స్వర్ణ భారత్ సేవలతో వేలాదిమంది గ్రామీ ణులు, పేద ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతోంది. ఈ నేపథ్యంలో, స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రాంగణంలో సోమవారం నిర్వహిం చిన సేవోత్సవాలకి ఉత్తరప్రదేశ్ ముఖ్య మంత్రి, బీజేపీ నేత యోగి ఆదిత్యనాథ్ రావడం ఎంతైనా విశేషం. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల సమగ్ర వికాసం, నిస్వార్థ ప్రజా సేవలో గత 25 సంవత్సరాలుగా స్వర్ణ భారత్ ట్రస్ట్ అందిస్తున్న సేవలు దేశా నికే ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియా డారు. స్వర్ణభారత్ ట్రస్ట్ ఏర్పాటుకు స్ఫూర్తిగా నిలిచిన భారతదేశ పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు బహుముఖ ప్రజ్ఞాశాలి అని అన్నారు. సరళత, సహజత్వం, నిరాడంబరమైన వ్యక్తిత్వంతో దేశవ్యాప్తంగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారని యోగి ఆదిత్యనాథ్ కొనియాడారు. 2001లో స్వర్ణభారత్ ట్రస్ట్ సేవా ప్రయాణం ప్రారంభమైందని, అదే సమయంలో దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లే మరో మహత్తర ప్రయాణం కూడా ప్రారంభమైందని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో 25 ఏళ్ల ప్రస్థానం, స్వర్ణభారత్ ట్రస్ట్ 25 ఏళ్ల సేవా ప్రస్థానం ఒకేసారి పూర్తికావడం ఆనందదాయకమన్నారు. రెండు ప్రస్థానాల ఆశయం "వికసిత్ భారత్" నిర్మాణమే అని పేర్కొన్నారు. భారత పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు, రాష్ట్ర మంత్రులు పొంగూరు నారాయణ, వై.సత్యకుమార్ యాదవ్, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు, శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ హిమాన్ష్ శుక్ల, స్వర్ణభారత్ ట్రస్ట్ చైర్మన్ కామినేని శ్రీనివాస్, మేనేజింగ్ ట్రస్టీ శ్రీమతి దీపా వెంకట్, ముప్పవరపు ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ ముప్పవరపు హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

### గ్రామీణ భారత ప్రగతే స్వర్ణభారత్ ట్రస్ట్ లక్ష్యం

**- వెంకయ్యనాయుడు**

భారతదేశ పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు మాట్లాడుతూ, గ్రామీణ భారతదేశం పురోగమించినప్పుడే సమగ్ర దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్న లక్ష్యంతోనే స్వర్ణభారత్ ట్రస్ట్‌ను నెలకొల్పినట్లు తెలిపారు.స్వచ్ఛంద సంస్థలు సమాజ నిర్మాణంలో ప్రభుత్వాలతో సమానంగా కీలక పాత్ర పోషించగలవని, నెల్లూరు జిల్లాలో స్వర్ణభారత్ ట్రస్ట్ సాధించిన ఫలితాలు ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ అని పేర్కొన్నారు.

# 8.74 కోట్లతో.. వేదగిరి అభివృద్ధి

## • మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



వేదగిరిలో పలు అభివృద్ధి పనుల శిలాఫలకం వద్ద మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

నెల్లూరు రూరల్ మండలం నరసింహకొండలోని శ్రీ వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధికి రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఇటీవల శ్రీకారం చుట్టారు. రూ.8.74 కోట్ల సీజేఏఎఫ్ నిధులతో అభివృద్ధి పనులకు ఆయన నెల్లూరురూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని దివ్యమైన పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దేందుకు పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. జిల్లాలోని భక్తులకు, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేలా ఆలయ అభివృద్ధికి బృహత్తర కార్యాచరణ రూపొం దించామని, ఆలయ ప్రాశస్త్యాన్ని మరింత పెంచే విధంగా అవసరమైన మౌలిక సదు పాయాలను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

## మంత్రి నారాయణ నాయకత్వంలో

## వీపీఆర్, డియస్ఆర్ వంటి దాతల దాతృత్వంతో

# నగరంలో ప్రభుత్వ బడులు బాగుపడుతున్నాయి!





నెల్లూరు నగరంలో పురాతన ప్రభుత్వ పాఠశాలలన్నిటికీ మహర్దశ పట్టింది. ముఖ్యంగా పురపాలక మంత్రి పొంగూరు నారాయణ, ఆయన కుమార్తెలు షరణి, సింధుల చొరవతో పాత బడులకు కొత్త కళ వస్తోంది. దాదాపు వంద సంవత్సరాల చరిత్ర కలిగిన వీఆర్ హైస్కూలు వీరి చొరవతో కొత్త అందాలు సంతరించుకుంది. తాజాగా మూలాపేటలోని బాలికల ప్రభుత్వ పాఠశాలని దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్టు సహకారంతో, దేవిరెడ్డి సుధాకరరెడ్డి గారి దాతృత్వంతో కోట్ల రూపాయల భూరి విరాళంతో పునఃనిర్మిస్తున్నారు. అలాగే స్టోన్‌హౌస్‌పేటలోని ఆర్ఎస్ఆర్ పాఠశాలని కూడా నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి చేయూతతో అభివృద్ధి చేస్తూ అక్కడ సైతం కోట్ల రూపాయలని వెచ్చిస్తున్నారు. ఈ రెండు పాఠశాలలని సెప్టెంబర్ 16న విద్యా మంత్రి లోకేష్ ప్రారంభించబోతున్నారు.


# ఎన్ని సవాళ్ళు ఎదురైనా.. ధర్మం వైపే నిలబడాలి

## ఇస్కాన్ శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో వేమిరెడ్డి



జిల్లా కలెక్టర్ హిమాన్ష్ శుక్ల, ఆయన కుమారుడు రియాన్ష్ శుక్లతో కలిసి అభిషేకం నిర్వహిస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

జీవితంలో ఎన్ని సవాళ్లు ఎదురైనా ధర్మం వైపు నిలబడాలని, మన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తించాలని శ్రీకృష్ణుడు భగవద్గీత ద్వారా మనకు మార్గం చూపించారని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. నెల్లూరు, ఇస్కాన్ మందిరంలో శ్రీకృష్ణాష్టమి సందర్భంగా నిర్వహించిన పూజలు, అభిషేకాలు తదితర వేడుకలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కృష్ణాష్టమి అంటే.. కేవలం ఒక పండుగ మాత్రమే కాదని, ధర్మం, భక్తి, జ్ఞానం, కర్తవ్యానికి ప్రతీకగా నిలిచిన శ్రీకృష్ణుడిని స్మరించుకునే పవిత్రమైన రోజని అన్నారు. గత దశాబ్ద కాలానికి పైగా తాను ఇస్కాన్ మందిరానికి తాను వస్తున్నానని చెప్పారు. నగరంలో ఇస్కాన్ చేపట్టే అన్ని కార్యక్రమాల్లో భాగస్వామిగా పాలుపంచుకునే అవకాశం శుకదేవస్వామి తనకు కల్పిస్తున్నారని ఈ సందర్భంగా విపిఆర్ పేర్కొన్నారు. తన కుమారుడు రియాన్ష్ శుక్లతో కలిసి ఈ వేడుకల్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ హిమాన్ష్ శుక్లా సైతం ఇస్కాన్ చేపడుతున్న కార్యక్రమాలు ఆధ్యాత్మికత తత్పరతతో ఉంటాయని అభినందించారు. ఈ సందర్భంగా వివిధ పోటీలలో పాల్గొన్న చిన్నారులకు బహుమతి ప్రదానం చేశారు. కృష్ణాష్టమి సందర్భంగా ఇస్కాన్ రూపొందించిన ప్రత్యేక సావనీర్‌ని కూడా విపిఆర్, ఇతర అతిథులు ఆవిష్కరించారు.



### వి.ఆర్ పాఠశాల లాగే..

# డీఎస్ఆర్, ఆర్ఎస్ఆర్ పాఠశాలల అభివృద్ధి

- పనులను పరిశీలించిన మంత్రి తనయ షరణి



విద్యార్థినీ విద్యార్థులతో మంత్రి నారాయణ కుమార్తె షరణి

నెల్లూరులోని మూలపేట డీఎస్ఆర్, స్టోన్‌హౌస్‌పేట ఆర్ఎస్ఆర్ పాఠశాలలను ప్రారంభించేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈ నెల 16వ తేదీ రానున్న నేపథ్యంలో.. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ కుమార్తె పొంగూరు షరణి మంగళవారం ఈ పాఠశాలలను సందర్శించారు..పాఠశాల మైదానాలు, తరగతి గదులను పరిశీలించిన ఆమె, చదువుకుంటున్న విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. విద్యార్థుల విద్యాభ్యాసం, మధ్యాహ్న భోజన నాణ్యతతో పాటు ఎన్‌సిసి విద్యార్థులకు అందుతున్న శిక్షణ తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె స్వయంగా పిల్లలకు మధ్యాహ్న భోజనాన్ని వడ్డించారు. షరిణి మాట్లాడుతూ గతంలో వీఆర్ పాఠశాలను ఏ విధంగా అభివృద్ధి చేశామో.. అంతకంటే మెరుగ్గా డిఎస్ఆర్, ఆర్ఎస్ఆర్ పాఠశాల లను తీర్చిదిద్దాలని తమ నాన్నగారు తనకు బాధ్యత అప్పగించారని తెలిపారు.

### అన్నా క్యాంటీన్‌లో.. అన్నం తిన్న షరణి :

నెల్లూరు నగరంలోని తడికలబజార్ సెంటర్‌లో ఉన్న అన్నా క్యాంటీన్‌ను షరణి ఇటీవల సందర్శించారు. కౌంటర్ దగ్గర 5 రూపాయల టికెట్ టోకెన్ తీసుకొని, వరుస క్రమంలో నిలబడి భోజనం తీసుకున్నారు. క్యాంటీన్‌లో అందిస్తున్న భోజన నాణ్యతను, రుచిని ఆమె స్వయంగా పరిశీలించారు. ఐదు రూపాయలకే కడుపునిండా పౌష్టికాహారం లభించడం పేదలకు కొండంత అండగా నిలుస్తుందని హర్షం వ్యక్తం చేశారు.

# 12న జాతీయ లోక్‌అదాలత్

### - జిల్లా ప్రధాన న్యాయమూర్తి -

జిల్లాలో జాతీయ లోక్‌అదాలత్‌ని ఈనెల 12న నిర్వహిస్తామని, రాజీకి యోగ్యమైన సివిల్ కేసులు, మునిసిపల్ కేసులు, భూసేకరణ కేసులు, వివాహ సంబంధమైన కేసులు వగైరాలను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరిస్తామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ.నరసింహమూర్తి చెప్పారు. ఈనెల 7న ఆయన జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ వై.జె. పద్మశ్రీతో కలసి జిల్లాలోని న్యాయాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. లోక్ అదాలత్ వల్ల కక్షిదారులకు సమయం ఆదా అవుతుందని, కోర్టుల ఖర్చులు తగ్గుతాయని అంటూ ఈ కార్యక్రమాన్ని అందరూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# జైలు సూపరింటెండెంట్ బదిలీ

జిల్లా కేంద్ర కారాగారం సూపరింటెండెంట్‌గా ఉన్న డా.వి.సన్యాసిరావు రాజమహేంద్రవరం సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఇక్కడ అదనపు సూపరింటెండెంట్‌గా ఉన్న ఎం.వెంకటేశ్వర్లుకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు ఈనెల 7న ఉత్తర్వులిచ్చారు.

# పసిపాప చికిత్సకి..3.51 లక్షల సాయం



సిఎంఆర్ఎఫ్ చెక్కునందజేస్తున్న ప్రశాంతిరెడ్డి

కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతమ్మ చొరవతో ఇటీవల ఓ పసిపాప చికిత్సకు 3.51 లక్షల రూపాయల సాయం అందింది. ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆ సాయం అందేలా ప్రశాంతమ్మ కృషి చేశారు. విడవలూరు మండలం కంచరపాళెం గ్రామానికి చెందిన పామర్తి రూప అనే మహిళ తన కుమార్తె ఏడురోజుల పసికందు అనారోగ్యంతో తక్కువ బరువుతో ఉండడంతో తగు చికిత్స కోసం ఎమ్మెల్యే ప్రశాంతమ్మను అభ్యర్థించగా, వైద్య చికిత్సల కోసం ముఖ్యమంత్రి సహాయనిధి అందేందుకు ఆమె అండగా నిలిచింది. ఆమేరకు 3,51,847 రూపాయల చెక్కును ఆ పసిపాప చికిత్స కోసం కుటుంబసభ్యులకి అందజేశారు.

# కామాక్షితాయి అమ్మవారికి..కుంకుమార్చన



నాల్గవ శ్రావణ శుక్రవారం పర్వ దినాన్ని పురస్కరించుకొని ఇటీవల జొన్నవాడలోని శ్రీ మల్లికార్జున స్వామి కామాక్షితాయి దేవస్థానంలో ఆలయ నిర్వాహకులు సామూహిక లక్ష కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా, దేవస్థానం అలంకార మండపంలో శ్రీ కామాక్షితాయి అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి ఆలయ అర్చకులు, వేద పండితులు లక్ష కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం అమ్మవారికి పంచామృత అభిషేకం సాయంత్రం కుంకుమార్చన అనంతరం, పల్లకి సేవ చేశారు. దేవస్థానం ఛైర్మెన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి ఆర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, ధర్మకర్త మండలి సభ్యులు పర్యవేక్షించారు.

# గూడూరు డివిజన్

# కోట రెసిడెన్షియల్ స్కూల్‌ని పునరుద్ధరించండి



మంత్రి ఫరూక్‌కి వినతిపత్రం సమర్పిస్తున్న ఎమ్మెల్యే సునీల్

కోటలో రద్దు చేసిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రెసిడెన్షియల్ స్కూల్‌ని పునరుద్ధరించాలని కోరుతూ నెల్లూరుజిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి ఎండి ఫరూక్‌కి గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ వినతిపత్రం సమర్పించారు. ఇటీవల అమరావతిలో ఆయనను కలిసిన ఎమ్మెల్యే సునీల్ ఎస్సీ రెసిడెన్షియల్ స్కూల్ నందు దాదాపు 600 మంది పిల్లలు చదువుతున్నారని, ఇటీవల ఈ స్కూల్‌ని ఎత్తివేయడంతో పిల్లలందరూ చాలా ఇబ్బంది పడుతున్నారని, కావున ప్రభుత్వం దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్ళి స్కూల్‌ని పునరుద్ధరించాలని కోరారు. అందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి, ప్రభుత్వం దృష్టికి ఈ సమస్యను తీసుకెళతానని తెలపడంతో ఎమ్మెల్యే సునీల్ ఆయనకి కృతజ్ఞతలు తెలిపారు.

# నైపుణ్య శిక్షణతో.. విద్యార్థులకు స్వయం ఉపాధి



విద్యార్థులకి అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ రాంప్రసాద్

విద్యార్థులు నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఎస్.కె.ఆర్. ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రాంప్రసాద్ సూచించారు. ఇటీవల గూడూరు ఎస్.కె.ఆర్. ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు నైపుణ్య శిక్షణ కార్యక్రమాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కార్పొరేషన్, కళాశాల నైపుణ్యాభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు అందుబాటులో ఉన్న వివిధ నైపుణ్య శిక్షణా అవకాశాలు, వాటి ద్వారా ఉపాధి మరియు స్వయం ఉపాధి పొందే మార్గాలపై అవగాహన కల్పించారు.నిర్వాహకులు ఆంజనేయులు, కన్వీనర్ బి.శైలజ, కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ ఎస్.కిరణ్మయి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నేత్రదానం మహాదానం



కరపత్రాలను విడుదల చేస్తున్న వైద్యులు

మృతి చెందిన తర్వాత నేత్రదానం చేయడం వల్ల మన కళ్ళు బ్రతికే ఉంటాయని, ప్రపంచాన్ని చూస్తాయని నేత్రదానంపై అపోహలు మానుకోవాలని గూడూరు ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ షరీనా వెల్లడించారు. గూడూరులోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఇటీవల 41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. నేత్రదానం గొప్పతనాన్ని తెలియజేస్తూ వైద్యులు కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనిషి చనిపోయిన తర్వాత కళ్ళు దానం చేస్తే.. ఆ కళ్ళు ఇంకొకరికి ప్రపంచాన్ని చూపిస్తాయని, ప్రతి ఒక్కరూ నేత్రదానం చేసేందుకు ముందుకు రావాలని సూచించారు. ఆర్.ఎం.ఓ ప్రసన్న, వైద్యులు హెలినా, తనుషా, స్నేహ, సిబ్బంది పాల్గొన్నారు.

# వెరికోస్ వెయిన్స్‌పై అవగాహన




అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రణీత్‌బాబు

గూడూరు పట్టణంలోని రోటరీ భవనంలో ఆదివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అవిస్ హాస్పిటల్స్ సౌజన్యంతో వెరికోస్ వెయిన్స్ మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా అవిస్ తిరుపతి బ్రాంచ్ డాక్టర్ ప్రణీత్‌బాబు వెరికోస్ వెయిన్స్ గురించి, వాటి నివారణ గురించి వివరించారు. అలాగే గూడూరు రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ తిరుమూరు సురేష్‌రెడ్డి మాట్లాడుతూ.. వెరికోస్ వెయిన్స్ సమస్య వందలో సుమారుగా 20మందికి పైగా ఉందని, సకాలంలో గుర్తించి సరైన వైద్యం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని ప్రజలని కోరారు. ఆసుపత్రి సిబ్బంది, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ తిరుమూరు సురేష్‌రెడ్డి, ఫాస్ట్ ప్రెసిడెంట్ బండి శ్రీధర్‌రెడ్డి, కిరణ్ చక్రవర్తి, రొటేరియన్స్ బలరాంరెడ్డి, రాంప్రసాద్, డి.ఆర్.డబ్ల్యు కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

### ఏడిఎంఎస్ వాహనాల్ని వాడండి..

# పర్యావరణాన్ని పరిరక్షించండి

### - బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు ఆనిమెళ్ళ-



షోరూంని ప్రారంభిస్తున్న ఆనిమెళ్ళ శివకుమార్

కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షించే విధంగా ఏడిఎంఎస్ ఎలక్ట్రికల్ వాహనాలను ఈ నెల 4న గూడూరు డివిజన్‌లో వెహికల్స్ డెవోతో గూడూరు బ్రాహ్మణ సేవాసంఘం అధ్యక్షులు ఆనిమెళ్ళ శివకుమార్ ప్రారంభించారు. ఆగస్టు 30వ తేదీ మంచిరోజు కావడంతో గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ షోరూంని ప్రారంభించగా, ఇప్పుడు పూర్తిస్థాయిలో వాహనాలు అందుబాటులో ఉంచి నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో మొత్తం 10 షోరూమ్‌లని ఏడిఎంఎస్ కంపెనీ ఎం.డి అశోక్ ఒకేరోజు వర్చ్యువల్‌గా ప్రారంభించారు. గూడూరు శాఖను 4వ తేదీన ఆనిమెళ్ళ శివకుమార్ స్వయంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడిఎంఎస్ ఎలక్ట్రికల్ వాహనాలను వినియోగించి పర్యావరణాన్ని రక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గూడూరు షోరూం అధినేత ఎస్ఎల్‌విఎన్ గాయత్రి ఏజన్సీస్ చిట్టమూరు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కడివేటి రామ్మూర్తి, శ్రీనివాసరావు, నరసింహం తదితరులు పాల్గొన్నారు.

# వినాయకచవితిని ప్రశాంతంగా జరుపుకోండి

### టౌన్ సీఐ శేఖర్‌బాబు



గూడూరు పట్టణంలో వినాయక చవితికి నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని గూడూరు టౌన్ సీఐ శేఖర్‌బాబు కోరారు. ఇటీవల ఆయన విలేకరులతో మాట్లాడుతూ వినాయక చవితికి డీజేలు అనుమతి లేదని, కమిటీ సభ్యులు ఖచ్చితంగా రాత్రిపూట విగ్రహం వద్ద ఉండాలని, రాత్రి పది తర్వాత లౌడ్‌స్పీకర్లు పెట్టకూడదని, ప్రతిఒక్కరూ నిబంధనలను పాటించాలని, లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# మాటలతో మారే జీవితం: యువతకు అవసరమైన సంభాషణ నైపుణ్యాలు

మనిషి జీవితాన్ని తీర్చిదిద్దే శక్తి చాలా సందర్భాల్లో మాటల్లోనే దాగి ఉంటుంది. ఒక మంచి మాట మనసును గెలుచుకుంటుంది.ఒక తప్పు మాట సంబంధాన్ని కోల్పోయేలా చేస్తుంది. యువతకు ఈ నైపుణ్యం మరింత అవసరం ఎందుకంటే వారు జీవితంలో అవకాశాలను నిర్మించే దశలో ఉన్నారు. "మాటలో మనిషి" అనే సామెత యాదృచ్ఛికంగా రాలేదు.అది అనుభవాల నుండి పుట్టిన సత్యం. సంభాషణ నైపుణ్యం అంటే కేవలం మాట్లాడటం కాదు, ఎలా, ఎప్పుడు, ఎవరితో, ఎంత మాట్లాడాలో తెలిసిన జ్ఞానం. ఈ నైపుణ్యం జీవితాంతం ఉపయోగపడే శక్తి, భవిష్యత్తును మార్చే సాధనం. యువతలో చాలామంది తమ ప్రతిభను, తమ ఆలోచనలను, తమ సామర్థ్యాన్ని వ్యక్తపరచలేక అవకాశాలను కోల్పోతుంటారు. ఒక విద్యార్థి ఎంత తెలివైనవాడైనా, తన ఆలోచనను స్పష్టంగా చెప్పలేకపోతే, అతని ప్రతిభను ప్రపంచం గుర్తించదు. ఒకసారి ఒక గురువు తన శిష్యునికి చెప్పిన మాట గుర్తు చేసుకోవాలి: "నీ ఆలోచన బంగారం లాంటిది, కానీ దాన్ని మాటల రూపంలో మలచలేకపోతే అది నేలలో పాతబడిన బంగారం." ఈ మాటలు యువతకు శాశ్వత పాఠం.

సంభాషణ నైపుణ్యం అంటే కేవలం మాట్లాడటం కాదు.వినడం కూడా అంతే ముఖ్యమైన భాగం. వినడం అనేది గౌరవం. ఎదుటివారి మాటను పూర్తిగా వినడం ద్వారా మనం వారి భావాన్ని అర్థం చేసుకుంటాం. ఒక విద్యార్థి తన ఉపాధ్యాయుడి సూచనలను శ్రద్ధగా వింటే, అతని అభివృద్ధి వేగంగా జరుగుతుంది. ఒక యువకుడు ఇంటర్వ్యూలో ప్రశ్నను పూర్తిగా విని, ఆలోచించి సమాధానం ఇస్తే, అతని ఆత్మవిశ్వాసం ప్రతిఫలిస్తుంది. "వినడం అనేది మనసు తెరవడం" అని ఒక తత్వవేత్త అన్నాడు. ఈ మాటలో ఉన్న లోతు యువత గ్రహించాలి.సంభాషణలో స్పష్టత అత్యంత ముఖ్యమైన అంశం. స్పష్టత లేకపోతే మాటలు గందరగోళాన్ని సృష్టిస్తాయి. ఉదాహరణకు, ఒక విద్యార్థి తన ప్రాజెక్ట్‌ను వివరించేటప్పుడు అర్థం కాని మాటలు, అసంపూర్ణ వాక్యాలు ఉపయోగిస్తే, అతని కృషి విలువ తగ్గిపోతుంది. కానీ అదే విద్యార్థి తన ఆలోచనను సరళంగా, క్రమబద్ధంగా, స్పష్టంగా చెప్పగలిగితే, అతని ప్రతిభ వెలుగులోకి వస్తుంది. స్పష్టత అంటే మాటలను తగ్గించడం కాదు; భావాన్ని స్పష్టంగా చెప్పడం. "స్పష్టతే సంభాషణకు ప్రాణం" అని చెప్పడం అతిశయోక్తి కాదు.యువతలో చాలామంది మాట్లాడేటప్పుడు భయం, సంకోచం, సందేహం వంటి భావాలతో బాధపడుతుంటారు. ఈ భావాలు సహజమే, కానీ వాటిని అధిగమించడం అవసరం. మాట్లాడటానికి ధైర్యం కావాలి, కానీ ఆ ధైర్యం సాధనతో వస్తుంది. ఒక విద్యార్థి ప్రతిరోజూ అద్దం ముందు రెండు నిమిషాలు మాట్లాడితే, అతని భయం తగ్గుతుంది. ఒక యువతి తరగతి గదిలో చిన్నచిన్న చర్చల్లో పాల్గొంటే, ఆమె ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. "ధైర్యం అనేది భయం లేకపోవడం కాదు; భయాన్ని అధిగమించడం" అనే మాట యువతకు మార్గదర్శకం.

జ్ఞాన నేత్రం
డా. నరసింహారెడ్డి ఊరిమిండి
Dallas, Texas, USA

సంభాషణలో శరీర భాష (body language) కూడా కీలక పాత్ర పోషిస్తుంది. మన కళ్లలోని నమ్మకం, చేతుల కదలికలు, నిలువు తీరు–ఇవన్నీ మనం మాట ప్రారంభించేముందే మన భావాన్ని వ్యక్తం చేస్తాయి.ఒక విద్యార్థి ఇంటర్వ్యూలో నిటారుగా కూర్చుంటే, కళ్లలో నమ్మకం ఉంటే, అతని మాటలకు మరింత బలం వస్తుంది. ఒక యువకుడు వేదికపై మాట్లాడేటప్పుడు చిరునవ్వుతో ప్రారంభిస్తే, ప్రేక్షకులు అతనితో అనుబంధం ఏర్పరుచుకుంటారు. శరీర భాష అనేది మాటలకు తోడు వచ్చే నిశ్శబ్ద శక్తి. సంభాషణ నైపుణ్యం అంటే సంబంధాలను నిర్మించే కళ. ఒక మంచి మాట స్నేహాన్ని పెంచుతుంది. ఒక కఠినమైన మాట దూరాన్ని పెంచుతుంది. యువత తమ స్నేహితులతో, ఉపాధ్యాయులతో, తల్లిదండ్రులతో, సహచరులతో మాట్లాడేటప్పుడు గౌరవం, వినయం, సహనం వంటి విలువలను పాటిస్తే, వారి సంబంధాలు బలపడతాయి. "మాటలతో మనసులు గెలుచుకోవచ్చు" అనే మాటను యువత తమ జీవితంలో అనుభవిస్తారు.

సంభాషణ నైపుణ్యం ఉద్యోగ ప్రపంచంలో మరింత కీలకం. ఒక యువకుడు తన ఆలోచనను స్పష్టంగా చెప్పగలిగితే, అతను నాయకత్వానికి ఎదుగుతాడు. ఒక యువతి తన టీమ్‌తో సమర్థవంతంగా మాట్లాడగలిగితే, ఆమె ప్రాజెక్ట్ విజయవంతమవుతుంది. ఉద్యోగ ప్రపంచంలో సంభాషణ నైపుణ్యం అనేది ప్రతిభకు వేదిక. ఒక మేనేజర్ ఒకసారి అన్నాడు: "మాటలతోనే మనం అవకాశాలను తెరవగలం." ఈ మాట యువతకు శాశ్వత పాఠం.సంభాషణ నైపుణ్యం అంటే సమస్యలను పరిష్కరించే శక్తి కూడా. ఒక సమస్యను కోపంతో, ఆవేశంతో మాట్లాడితే అది మరింత పెద్దదవుతుంది. కానీ అదే సమస్యను శాంతంగా, స్పష్టంగా, పరిష్కార దృక్పథంతో మాట్లాడితే అది చిన్నదవుతుంది. యువత తమ భావాలను నియంత్రించి, ఆలోచించి మాట్లాడితే, వారు జీవితంలో అనేక సమస్యలను సులభంగా పరిష్కరించగలరు. సంభాషణ నైపుణ్యం అనేది సాధనతో పెరుగుతుంది. ప్రతిరోజూ కొద్దిగా చదవడం, మంచి ప్రసంగాలు వినడం, మంచి రచనలు ఆస్వాదించడం, చిన్న చిన్న చర్చల్లో పాల్గొనడం–ఇవన్నీ మన మాటతీరు, మన భావ వ్యక్తీకరణ, మన ఆత్మవిశ్వాసాన్ని మెరుగు పరుస్తాయి.ఒక విద్యార్థి ప్రతిరోజూ ఒక చిన్న పేరాగ్రాఫ్ రాస్తే, అతని ఆలోచన క్రమబద్ధంగా మారుతుంది. ఒక యువతి ప్రతిరోజూ ఐదు నిమిషాలు మాట్లాడే సాధన చేస్తే, ఆమె మాటల్లో నమ్మకం పెరుగుతుంది. "సాధనతోనే శక్తి" అనే మాట సంభాషణ నైపుణ్యానికి కూడా వర్తిస్తుంది.చివరగా, సంభాషణ నైపుణ్యం అనేది యువతకు జీవితాంతం ఉపయోగపడే ఆస్తి. ఈ నైపుణ్యం వారి విద్యలో, ఉద్యోగంలో, సంబంధాల్లో, నాయకత్వంలో, వ్యక్తిత్వంలో–ప్రతిచోట ప్రభావం చూపుతుంది. మాటలతో మనం మన భవిష్యత్తును నిర్మించగలం. మాటలతో మనం అవకాశాలను తెరవగలం. మాటలతో మనం మనసులను గెలుచుకోగలం. 'మాటలతో మారే జీవితం' అనే శీర్షికలో ఉన్న భావం యువత తమ జీవితంలో అనుభవించాలి.



**వచ్చే వారం :** వేదికను జయించే సంభాషణ శక్తి: మాటలతో మెరుస్తున్న వ్యక్తిత్వం

E-mail: reddyu@gmail.com

## సాకారమైన కల!..

# 70 ఏళ్ల నిరీక్షణకు తెర!

- **సర్వేపల్లి కాలువకట్ట వాసుల కష్టాలు తీరాయి**



నారాయణ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న గునుకుల విజయలక్ష్మి

దాదాపు 70 సంవత్సరాలుగా సర్వేపల్లి కాలువకట్టపై నివసిస్తూ, తమ ఇళ్లకు పట్టాల కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాల కల సాకారమైంది. సర్వేపల్లి కాలువకట్ట నివాసితులకు శాశ్వత పట్టాలు అందించేందుకు ఇటీవల రాష్ట్ర కేబినెట్ ఆమోదం లభించిన సందర్భంగా కాలువకట్టపై కూటమి నాయకులు, స్థానికులు సంబరాలు నిర్వహించారు. జనసేన పార్టీ నాయకుడు గునుకుల కిషోర్, ఆయన సతీమణి విజయలక్ష్మి, జనసేన, తెలుగుదేశం, బీజేపీ కూటమి నాయకులు పాల్గొన్నారు. ఒకే విడతలో 1,206 పేద కుటుంబాలకు శాశ్వత హక్కులు కల్పించే దిశగా కేబినెట్ ఆమోదం రావడం పేదల జీవితాల్లో మరచిపోలేని మైలురాయి అని గునుకుల కిషోర్ చెప్పారు. 'నమ్మకం అంటే నారాయణ' అనే విధంగా ఈ సమస్య పరిష్కారానికి మంత్రి పట్టుదలతో పనిచేశారన్నారు. అనంతరం, కేబినెట్ ఆమోదం పట్ల హర్షం వ్యక్తంచేస్తూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి పొంగూరు నారాయణ చిత్రపటాలకి కూటమి నాయకులు, స్థానికులు కలిసి పాలాభిషేకం నిర్వహించారు.

# ఉపాధ్యాయుల సేవలు అమూల్యం!



సత్కారాలందుకుంటున్న ఉపాధ్యాయులు

విద్యార్థులకు విద్యతో పాటు నైతిక విలువలని కూడా బోధించి వారిలో ఆత్మవిశ్వాసం పెంచుతూ, క్రమ శిక్షణతో జీవితంలో రాణించేలా వారి భవిష్యత్తుకు బాటలు వేస్తున్న ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివని వక్తలు కొనియాడారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, జిల్లా శాఖ ఆధ్వర్యంలోని ఎం.ఎస్.ఆర్. స్పాస్టిక్స్ సెంటర్‌లో ఈనెల 5న గురుపూజోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐ.ఆర్.సి.ఎస్. అడ్‌హాక్ కమిటీ సభ్యులు యాలమూరి రంగయ్యనాయుడు, స్పాస్టిక్స్ సెంటర్ ప్రిన్సిపాల్ ఎం.విజయభాస్కర్, స్పాస్టిక్స్ సెంటర్ ఇన్‌చార్జ్ డా. జి.వాసు పాల్గొన్నారు. అనంతరం ఎం.ఎస్.ఆర్ స్పాస్టిక్స్ సెంటర్‌లో సేవలందిస్తున్న ఉపాధ్యాయులను సత్కరించారు.

## 'నారాయణ' విద్యార్థిని..

# యశస్విని ప్రతిభ



నెల్లూరు, నారాయణ మహిళా కాలేజీలో సెకండ్ ఇయర్ చదువుతున్న పానుగోటి యశస్విని ఇటీవల సెవెన్త్ జోన్ పెన్ కాక్ శిలాట్ ఛాంపియన్‌షిప్ 2026-27లో అద్భుత ప్రతిభతో పతకాలు సాధించింది. ఈ పోటీలలో తమిళనాడు, కర్ణాటక, కేరళ, తెలంగాణ, లక్షద్వీప్, అండమాన్ నికోబార్‌లతో పాటు ఆంధ్రప్రదేశ్ జట్లు పాల్గొన్నాయి. ఇందులో ఏపీ జట్టులో యశస్వినికి పెన్ కాక్ శిలాట్ సోలోలో, తాండింగ్‌లోనూ కలిపి రెండు కాంస్య పతకాలు సాధించడం విశేషం. అంతే కాదు, కళాంజలి అనంత్ దర్శకత్వంలో ఉన్న 'గమ్..మత్తు' షార్ట్‌ఫిల్మ్‌లో కూడా ఆమె నటిస్తోంది. ఈ సందర్భంగా స్థానిక కళాకారులు, క్రీడాకారులు యశస్వినికి శుభాకాంక్షలు తెలిపారు.

## ఎడగారు పంటలకు

# సాగునీరు ఇవ్వాలి

జిల్లాలో ఈ ఎడగారు సీజన్‌లో వరి పంటలకు అవసరమైన సాగునీరు అందించేందుకు అధికారులు వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పి.శ్రీరాములు కోరారు. ఇటీవల నెల్లూరులోని డా. రామచంద్రారెడ్డి భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలో సాగునీటి అవసరాలు తీర్చుతూ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పూడిపర్తి జనార్దన్, మూలి వెంగయ్య పాల్గొన్నారు.

# చవితి వేడుకలకు పారదర్శకంగా అనుమతులు

## - జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల



వినాయకచవితి వేడుకలకు నెల్లూరు నగరం ముస్తాబవుతోంది. వీధివీధినా మండపాలు, పందిర్లు వెలుస్తున్నాయి. ఈ వేడుకల్లో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు ఎదురుకాకుండా శాంతియుతంగా నిర్వహించుకోవాలని, అన్ని నిబంధనలను తప్పనిసరిగా పాటించాలనిజిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల స్పష్టం చేశారు. ఈ వేడుకల నిర్వహణకు ముందస్తు అనుమతులు ఉండాలన్నారు. సింగిల్‌విండో ఆన్‌లైన్ ద్వారా ముందస్తు అనుమతులను పారదర్శకంగా జారీచేస్తామన్నారు. ఉత్సవాల నిర్వహణలో భాగంగా వినాయక మండపాల ఏర్పాటు, ఊరేగింపులు, నిమజ్జనోత్సవాలు అన్నిటికీ అనుమతుల ప్రక్రియను సులభతరం చేశామని కూడా ఎస్పీ వివరించారు.

# బాలింత ప్రాణం నిలబెట్టిన.. అపోలో



వివరాలను వెల్లడిస్తున్న అపోలో ఆసుపత్రి వైద్య బృందం

సాధారణ కాన్పు తర్వాత తీవ్ర రక్తస్రావంతో ప్రాణాపాయ స్థితికి చేరుకుని, అవయవాల వైఫల్యంతో కొట్టుమిట్టాడుతున్న 40 ఏళ్ల బాలింతకు నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు ఇటీవల అత్యాధునిక చికిత్స అందించి పునర్జన్మ ప్రసాదించారు. ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు ఆ వివరాలు తెలిపారు. కన్సల్టెంట్ గైనకాలజిస్ట్ డాక్టర్ టి.జి.లక్ష్మి దుర్గ, సీనియర్ కన్సల్టెంట్, ఎమర్జెన్సీ మరియు క్రిటికల్ కేర్ నిపుణులు డాక్టర్ యం.శ్రీనివాస్, నెఫ్రాలజిస్టులు డాక్టర్ ఎ. కె. చక్రవర్తి, డాక్టర్ మస్తాన్‌వలి, ఆసుపత్రి డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, యూనిట్ హెడ్ విశ్వేశ్వర్ రెడ్డిలు మాట్లాడుతూ, బాధితురాలు ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మగబిడ్డకు జన్మనిచ్చిన అనంతరం గర్భాశయ సంకోచ వైఫల్యం, గర్భాశయ ముఖద్వారంలో చీలికల కారణంగా తీవ్ర రక్తస్రావం సంభవించిందని, రక్తపోటు పడిపోయి హెమరేజిక్ షాక్ మరియు శ్వాసకోశ ఇబ్బందులు తలెత్తడంతో వెంటిలేటర్‌పై అత్యంత విషమ స్థితిలో నెల్లూరు అపోలో ఆసుపత్రికి తీసుకువచ్చారని తెలిపారు. ఐసీయూలో నిరంతర పర్యవేక్షణతో కూడిన చికిత్స అందించడంతో బాధితురాలి ప్రాణం నిలబడిందని చెప్పారు. అపోలోలో సమగ్ర నిపుణుల బృందం అందుబాటులో ఉండటం వల్లే ఇలాంటి సంక్లిష్ట కేసుల్లో ప్రాణాలు కాపాడటం సాధ్యమైందని, నెల్లూరు ప్రజలకు అత్యున్నత వైద్యసేవలు అందించడంలో అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ ఎల్లప్పుడూ ముందుంటుందని చెప్పారు.

# కల్యాణ వైభవం...!

**విఖ్యాత్ - లక్ష్మి**



నెల్లూరు వాస్తవ్యులు ముత్యాల రాజేంద్ర - శ్రీమతి శశిరాజేంద్రల కుమారుడు
**ముత్యాల రాజేంద్ర విఖ్యాత్ - లక్ష్మి ఎస్ ప్రసాద్**ల పరిణయం
సెప్టెంబర్ 7వ తేదీ కేరళలో వేడుకగా జరిగింది. కొత్త జంటకి 'లాయర్' శుభాశీస్సులు.

**సుందర్ - విఘ్నేశ్వరి**



నెల్లూరు వాస్తవ్యులు జమిలి జ్వాలాంజనేయులు - కీ॥శే॥ శ్రీమతి రాజ్యలక్ష్మిల కుమారుడు
**సుందర్ గణేష్ - విఘ్నేశ్వరి**ల వివాహం సెప్టెంబర్ 5వ తేదీ నెల్లూరులో వైభవంగా జరిగింది.
నవ దంపతులకి 'లాయర్' శుభాకాంక్షలు.

**సవరణ :** గత వారం 'లాయర్' 7వ పేజీలోని "కల్యాణ వైభవం" శీర్షికలో ప్రచురితమైన మాజీ శాసనసభ్యులు జె.కె.రెడ్డి మనుమడి పెళ్లి ఫోటోలో పెళ్లి కొడుకు తల్లి పేరు విజితకి బదులుగా "వినుజ" అని గమనించ ప్రార్థన. అచ్చుతప్పుతో కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నాం. - సం/-



## 'గానగంధర్వుడి'ని సంస్మరించుకున్న బాలగంధర్వులు

సెప్టెంబర్ 7వ తేదీ సోమవారం సాయంత్రం నెల్లూరులోని భారతీయ సినిమా గాయకులు ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం స్మారకాన్ని సందర్శించి ఆయన విగ్రహం వద్ద నివాళులర్పించి స్వరాంజలి ఘటించిన హైదరాబాద్ 'లిటిల్ మ్యూజిషియన్స్ అకాడమీ' వ్యవస్థాపకుడు రామాచారి మరియు వారి శిష్య బృందం.

# అశ్లీల దూషణలు మంచిది కాదు

## విలేకర్లతో ఇష్టాగోష్టిలో పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



సభల్లో, చట్టసభల్లో గౌరవప్రదమైన చర్చలు సాగాలని, నిరసనలకు హద్దులు ఉండాలని, అశ్లీల దూషణలు చేసే ధోరణి మారాలని భారత పూర్వ ఉపరాష్ట్రపతి శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. నెల్లూరు జిల్లా వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రాంగణంలో ట్రస్ట్ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 9న నిర్వహించిన మీడియా మిత్రుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో సాంస్కృతిక, నైతిక విలువలను పరిరక్షించుకోవాల్సిన తక్షణ ఆవశ్యకత ఉందని, అందుకోసం పాఠశాల విద్య నుంచే విద్యార్థులకు నైతిక విలువల తరగతులు తప్పనిసరి చేయాలని ఆయన సూచించారు. ప్రజాస్వామ్యంలో విధానాల ఆధారంగా విమర్శలు ఉండాలి తప్ప వ్యక్తులపై, కుటుంబాలపై బురదజల్లే వ్యక్తిగత దూషణలు ఉండకూడదన్నారు. ఆస్ట్రేలియా తదితర అంతర్జాతీయ దేశాల్లో అమలు చేస్తున్న తరహాలోనే, మన దేశంలోనూ 16 నుంచి 18 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియా ఖాతాలు ఉండకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్ట బద్ధమైన చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో పిల్లలకు మొబైల్ ఫోన్లు అనుమతించకూడదన్నారు. రాజకీయాల్లో వారసత్వాన్ని తాను ఎన్నడూ ప్రోత్సహించలేదని, అయితే ప్రజాసేవలో మాత్రం యువత, తన కుటుంబసభ్యులు సేవా వారసత్వాన్ని అందిపుచ్చుకుని ట్రస్ట్‌ను మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ శ్రీమతి దీపా వెంకట్, మీడియా ప్రతినిధులు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

# బీఎంఆర్‌కి.. నూతన బాధ్యత!

## - రాజ్యసభ హౌస్‌కమిటీ సభ్యునిగా నియామకం -



రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావుయాదవ్ (బీఎంఆర్)కి మరో నూతన బాధ్యత లభించింది. రాజ్యసభ హౌస్ కమిటీ సభ్యునిగా ఆయన నియమితులయ్యారు. ఈనెల 3వ తేదీ నుంచే ఆ నియామకం అమలులోకి వచ్చినట్లు తెలిపారు. ఎంపీల నివాస వసతి, టెలిఫోన్, ఆహారం తదితర సౌకర్యాలపై పర్యవేక్షణ, అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడం వంటివి ఇందులో ప్రధాన బాధ్యతలుగా ఉంటాయి.

### బీసీ సంక్షేమ కమిటీ సభ్యుడిగా.. మరోసారి

రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావుయాదవ్‌కి పార్లమెంట్‌లోని ఇతర వెనుకబడిన తరగతుల (ఓబీసీ) సంక్షేమ కమిటీ 2026-27లో సభ్యుడిగా మరోసారి అవకాశం లభించింది. లోక్‌సభ సెక్రటేరియట్ విడుదల చేసిన అధికారిక బులెటిన్ ప్రకారం, ఆ కమిటీలో లోక్‌సభ నుంచి 20 మంది, రాజ్యసభ నుంచి 10 మంది సభ్యులు ఉన్నారు. ఈ కమిటీకి గణేష్‌సింగ్‌ని చైర్పర్సన్‌గా నియమించారు. బీసీ వర్గాల హక్కులు, సంక్షేమ పథకాలు, వారి అభివృద్ధికి సంబంధించిన అంశాలను కమిటీ దృష్టికి తీసుకెళ్లి, వారి ప్రయోజనాల కోసం తన వంతు కృషి కొనసాగిస్తానని మస్తాన్‌రావు పేర్కొన్నారు.

# కడుపుమంటతోనే డీఎస్సీపై వైసీపీ విసుర్లు



సోమిరెడ్డి

ఐదేళ్లలో ఒక్క టీచర్ పోస్టు భర్తీ చేయని వైసీపీకి డీఎస్సీపై మాట్లాడే అర్హత లేదని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వైసీపీ నేతలను తూర్పారబట్టారు. గ్రూప్ 1 పరీక్షలను వివాదం చేసిన వైసీపీ... మెగా డీఎస్సీపై అభాండాలు వేయడం విడ్డూరమన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓర్వలేకే జగన్‌రెడ్డి కుట్రలు పన్నుతున్నారని, చంద్రబాబునాయుడు సారథ్యంలో ఇరిగేషన్ ప్రాజెక్టులు ఒక్కొక్కటిగా పూర్తవుతుండటంతో జీర్ణించుకోలేక టీడీపీపై లేనిపోని విమర్శలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఇటీవల మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, 16400 టీచర్ పోస్టులు భర్తీ చేసిన మెగా డీఎస్సీకి నారా లోకేష్ ఒక బ్రాండ్ అని, ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరిగిందని ఆయన స్పష్టం చేశారు. అయితే వైసీపీ మాత్రం డీఎస్సీలో అక్రమాలు జరిగాయంటూ దుష్ప్రచారం చేస్తోందన్నారు. 2019కి ముందు 23 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్న జగన్‌రెడ్డి ఒక్క ఉద్యోగాన్ని కూడా ఎందుకు భర్తీ చేయలేదని ఆయన ప్రశ్నించారు.

# జర్నలిస్టుల పిల్లలకి ఫీజు రాయితీ

ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్‌ల అభ్యర్థన మేరకు జిల్లాలోని ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న అక్రిడిటేషన్ కలిగిన వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి డా. బాలాజీరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ ఉత్తర్వుల మేరకు అక్రిడిటేషన్ కలిగిన వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యాలు తప్పనిసరిగా 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని ఆయా పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రధానోపాధ్యాయులకు తెలియజేయడం జరిగిందన్నారు. దరఖాస్తు ఫారాలను సంబంధిత అసోసియేషన్ వారి నుండి పొందవచ్చునని తెలిపారు. ఈ ఉత్తర్వులకు విరుద్ధంగా వ్యవహరించే పాఠశాలల వివరాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని డీఈఓ తెలిపారు.

# యువశ్రీ మురళికి.. శ్రీసిటీ ఎం.డీ అభినందనలు



యువశ్రీ మురళి, ఇతర ప్రముఖులను పురస్కారాలతో సత్కరిస్తున్న శ్రీసిటీ ఎండీ

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత యువశ్రీ మురళికి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అభినందనలు తెలిపారు. ఆయన భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు, పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు. 2024లో శ్రీసిటీ శ్రీవాణి ఉగాది పురస్కారంతో యువశ్రీ మురళిని గౌరవించిన సందర్భాన్ని గుర్తుచేసుకున్న ఆయన, ఇలాంటి ప్రతిభావంతులను శ్రీవాణి ద్వారా సత్కరించుకోవడం గర్వంగా భావిస్తున్నామన్నారు.

## ఒంగోలులో..
# డా.నాగభైరవ కాంస్య విగ్రహం




సుప్రసిద్ధ కవి, రచయిత డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు కాంస్య విగ్రహాన్ని ఇటీవల ఒంగోలులో ప్రతిష్ఠించారు. ఒంగోలు మున్సిపాలిటీ ఏర్పడి 150 సంవత్సరాలైన సందర్భంగా జరిగిన వేడుకల్లో ప్రకాశం జిల్లాకు చెందిన వివిధ రంగాల ప్రముఖుల విగ్రహాలను ప్రతిష్ఠించాలని మున్సిపాలిటీ వారు నిర్ణయించడం, అందులో భాగంగా సాహితీ రంగంలో విశిష్ట సేవలందించిన డాక్టర్ నాగభైరవ విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో స్థానికులు, డా. నాగభైరవ శిష్యులు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. నాగభైరవ విగ్రహ ఏర్పాటులో నాగభైరవ కుటుంబ సభ్యులు డా. నాగభైరవ ఆదినారాయణ, డా. నాగభైరవ ఆంజనేయులు, నాగభైరవ వీరబాబులతో పాటు, నాగభైరవ సాహిత్యపీఠం –ఒంగోలు, సాహితీవేత్తలు.. నాగభైరవ అభిమానులు డా. భూసురపల్లి వెంకటేశ్వర్లు, డా. బీరం సుందరరావు, చిన్ని నారాయణరావు (నెల్లూరు), ఎం.వెంకటేశ్వర్లు, డా. నూనె అంకమ్మరావు, తేళ్ల అరుణ, బీనీడి కృష్ణయ్య, డా. యు. దేవపాలన, మరియు నాగభైరవ రచించిన 'కవనవిజయం'ను ప్రదర్శించిన సాహితీ–కళాకారులు అందరూ అందుకు సహకరించారు. నాగభైరవ కాంస్య విగ్రహంతో పాటు, ఆ శిలాఫలకంపై 'ప్రముఖ కవి, సాహితీవేత్త దివంగత డా. నాగభైరవ కోటేశ్వరరావు 'భువన విజయం'కి పేరడీగా 20వ శతాబ్దపు తెలుగు కవితా ధోరణులను ఆవిష్కరించే ప్రదర్శనాకావ్య నాటకంగా 'కవనవిజయం' అనే సాహితీరూపకాన్ని రచించగా, దానిని 300కు పైగా ప్రదర్శనలు ఇవ్వడం జరిగిందని, అంతేకాక ఎన్టీఆర్‌కి అత్యంత సన్నిహితులైన వీరు ఆయన ప్రతిష్ఠాత్మక చిత్రం 'బ్రహ్మర్షి విశ్వామిత్ర'కి మాటల రచయితగా పనిచేసి విశేష గుర్తింపు పొందారని'.. కూడా ఆయన శిలాఫలకంపై చెక్కించడం విశేషం.

## నెల్లూరు కళాకారిణి వైష్ణవికి
# 'నాట్య చూడామణి' బిరుదు



'నాట్య చూడామణి' బిరుదునందుకుంటున్న వైష్ణవి

హైదరాబాద్‌లోని శిల్పారామంలో తెలంగాణ ప్రభుత్వం, శిల్పారామం మరియు కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన నృత్య వేడుకల్లో నెల్లూరుకు చెందిన శ్రీ విఘ్నేశ్వర నృత్య నికేతన్ తన ప్రతిభను చాటుకుంది. గురువు విజయలక్ష్మి మార్గదర్శకత్వంలో నాట్యకళాకారిణి వైష్ణవి నేతృత్వంలో ప్రదర్శించిన కూచిపూడి నృత్యాంశాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా, కూచిపూడి నాట్య రంగానికి వైష్ణవి అందిస్తున్న సేవలను కొనియాడుతూ ఆమెను 'నాట్యచూడామణి' పురస్కారంతో సత్కరించడం విశేషం. రష్యా సాంస్కృతిక కేంద్రం డైరెక్టర్ అలెక్సీ, ప్రముఖ నాట్య కళాకారిణి పద్మ రాగిణి పుట్టు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త తగిరాల పురుషోత్తం ఈ సత్కార వేడుకలో పాల్గొని ఆమెకి పురస్కారాన్ని అందజేశారు.

## ఆలయాల పరిరక్షణకు..
# ప్రభుత్వం పెద్దపీట
### ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల



శ్రీ కోదండ రామస్వామి గర్భాలయ శంకుస్థాపన పూజల్లో ఎమ్మెల్యే కాకర్ల సురేష్

గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధితో పాటు ప్రజల మనోభావాలకు అనుగుణంగా దేవాలయాల పరిరక్షణ, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. వరికుంటపాడు మండలం, కొండాయపాలెం పంచాయతీ పరిధిలోని ధర్మవరం గ్రామంలో ఇటీవల శ్రీ కోదండ రామస్వామివారి నూతన గర్భాలయ, ఆలయ నిర్మాణ శంకుస్థాపన మహోత్సవ కార్యక్రమాలను ఇటీవల గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సహకారంతో ఆలయ అభివృద్ధి కోసం మంజూరైన రూ.70 లక్షల నిధులతో చేపడుతున్న నూతన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శంకుస్థాపన చేశారు.

# వార్డుల విభజన సరిగా లేదు
### - వైసీపీ నేత రామ్‌కుమార్‌రెడ్డి విమర్శ -



వెంకటగిరిలో వార్డుల పునర్విభజన పారదర్శకంగా జరగలేదని వైసీపీ నేత, వెంకటగిరి వైసీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. ఇటీవల ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, వెంకటగిరిలో కొన్ని వార్డుల్లో 700 ఓట్లు మాత్రమే ఉండగా, మరికొన్ని వార్డుల్లో 1,400కు పైగా ఓట్లు ఉన్నాయని తెలిపారు. వార్డుల పునర్విభజన ఏ ప్రాతిపదికన జరిగిందో స్థానిక ఎమ్మెల్యే, అధికారులు ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో వెంకటగిరిలో సుమారు 8,400 మంది ఓటర్లను ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వలస వెళ్లినవారు, అందుబాటులో లేనివారిగా, కొందరిని మృతులుగా గుర్తించారని తెలిపారు. అలాంటి ఓటర్లను గుర్తించిన తర్వాత కూడా పాత ఎన్నికల జాబితా ప్రకారమే ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. ఎన్నికల నిలుపుదల లేదా వాయిదాను వైఎస్ఆర్‌సీపీ కోరుకోవడం లేదని, ఎన్నికలు సజావుగా జరగాలని, ప్రతి చోట పోటీ ఉండాలని తాము కోరుకుంటున్నామన్నారు.

# కవితా ఝరి.. 'కవికోకిల' దువ్వూరి



తెలుగు సాహితీ ఆకాశంలో కొందరు కవులు నక్షత్రాల్లా మెరిసి పోతారు. మరికొందరు కోకిలల్లా తియ్యగా పాడి మన హృదయాల్లో నిలిచిపోతారు. అలాంటి కోకిలమ్మల్లో అగ్రగణ్యుడు దువ్వూరి రామిరెడ్డి. పండితులు ముద్దుగా 'సింహపురి సిరి' అని పిలుచుకున్న ఈ కవికోకిల స్వరం నేటికీ తెలుగు వారి చెవుల్లో మారుమోగుతూనే ఉంది.

1895 నవంబర్ 9న ప్రస్తుత శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా గూడూరులో, లక్ష్మీదేవమ్మ, సుబ్బారెడ్డి దంపతులకు పెద్ద కుమారుడిగా దువ్వూరి రామిరెడ్డి జన్మించారు. పుట్టింది రైతు కుటుంబమే అయినా, ఆయన మనసు ఎప్పుడూ అక్షరాల పొలంలోనే ఉండేది. బడిలో పెద్ద చదువులు చదవలేదు. కానీ స్వయంకృషితో తెలుగు, సంస్కృతం, ఆంగ్లం, పారశీకం వంటి అనేక భాషల్లో అపార పాండిత్యాన్ని సంపాదించారు. 23 ఏళ్ల వయసుకే కావ్యాలు రాయగల స్థాయికి ఎదిగారంటే ఆయన ప్రతిభ ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు. 1929లో విజయవాడ ఆంధ్ర మహాసభలో ఆయనకు 'కవికోకిల' బిరుదు లభించింది.

### రైతు గుండె చప్పుడు - 'కృషీవలుడు'

రామిరెడ్డి రైతు బిడ్డ. అందుకే ఆయన కలం నుంచి 1924లో 'కృషీవలుడు' అనే అద్భుత కావ్యం జాలువారింది. తెలుగు సాహిత్యంలో రైతును నాయకుడిని చేసి వచ్చిన తొలి కావ్యాల్లో ఇదొకటి. ఆ కావ్యానికి కట్టమంచి రామలింగారెడ్డి ముందుమాట రాశారు. ఆయన తొలి రచన 'వనకుమారి' విజయనగరం సంస్థానంలో ప్రథమ బహుమతి పొందింది.

### 'పానశాల'తో అమరత్వం

దువ్వూరి పేరు చెప్పగానే గుర్తొచ్చే రచన 'పానశాల'. పర్షియా మహాకవి ఉమర్ ఖయ్యామ్ 'రుబాయత్'కు ఇది స్వేచ్ఛానువాదం. 1926లో హైదరాబాద్ పర్యటనలో మిత్రుడు ఇచ్చిన పారశీక ప్రతిని చదివి, ఆ తాత్వికతకు ముగ్ధుడై ఈ అనువాదానికి పూనుకున్నారు. 'అంతము లేని యీ భువనమంత పురాతన పాంథశాల' వంటి పద్యాలు నేటికీ పండితుల నోళ్లలో నానుతూనే ఉన్నాయి.

### పద్యంలో సంగీతం, గద్యంలో చిత్రం

రామిరెడ్డి రచనా శైలి ప్రత్యేకమైనది. ఆయన పద్యం చెప్పినా, గద్యం రాసినా అందులో ఒక లయ, ఒక సంగీతం ఉంటుంది. మాటలను కూర్చడం కాదు, ముత్యాలను ఏరి కూర్చడం ఆయనకు తెలుసు. ప్రకృతిని వర్ణించడంలో ఆయనకు ఆయనే సాటి. 'వనకుమారి'లో అడవి అందాలను కళ్లకు కట్టినట్టు చూపారు. ఆయన అనువాదం మక్కీకి మక్కీ కాదు, మన తెలుగు నుడికారానికి అద్దిన అత్తరు. అందుకే 'పానశాల' తెలుగు వారి సొంత కావ్యమైపోయింది.

తెలుగు సాహిత్యానికి రామిరెడ్డి చేసిన సేవ అనన్యం. భావ కవిత్వానికి, అభ్యుదయ కవిత్వానికి మధ్య వారధిలా నిలిచారు. కేవలం కవిత్వమే కాదు, నాటకం, నవల, విమర్శ, అనువాదం – ఇలా అన్ని ప్రక్రియల్లోనూ తన ముద్ర వేశారు.

కీర్తిమూర్తులు

'కవిత్వ తత్వ విచారము' వంటి విమర్శ గ్రంథాల ద్వారా కవిత్వం ఎలా ఉండాలో నిర్వచించారు. భావం గాఢంగా ఉండాలి, భాష సరళంగా ఉండాలి అనేది ఆయన సిద్ధాంతం. నెల్లూరులో ఆయన ఇంటి గ్రంథాలయం ఒక సాహిత్య కేంద్రంగా ఉండేది, ఎందరో యువ కవులకు అది మార్గదర్శకమైంది.

### నాటకాల్లో తాదాత్మ్యం - సినిమాల్లో చరిత్ర

'కుంభరాణా' నాటకాన్ని దువ్వూరి కేవలం తొమ్మిది రోజుల్లో రాశారు. "ఆ తొమ్మిది రోజులు నేను కుంభరాణాగానే జీవించాను" అని ఆయనే చెప్పుకున్నారు. 'కర్షక విలాసం', 'సీతావనవాసం' వంటి పదికిపైగా నాటకాలు రాశారు. సినీ రంగంలో 1936లో 'సతీ తులసి' చిత్రానికి రచయితగా అడుగుపెట్టి, 'చిత్రనళీయం' చిత్రానికి దర్శకత్వం వహించి సినీ దర్శకుడైన మొదటి తెలుగు కవిగా చరిత్ర సృష్టించారు. కవిత్వం నుంచి సినిమా దాకా ఆయన చూపిన బహుముఖ ప్రజ్ఞ అందరినీ ఆశ్చర్యపరిచింది.

### దేశభక్తి - 'మాతృశతకం'

రామిరెడ్డి గొప్ప జాతీయవాది. గాంధీజీని అవతార పురుషుడిగా ఆరాధించారు. ఆయన రాసిన 'మాతృశతకం'లోని ప్రతి పద్యం బ్రిటీష్ పాలనపై సంధించిన అస్త్రమే. అందుకే బ్రిటీష్ ప్రభుత్వం ఆ పుస్తకాన్ని నిషేధించింది. చిత్రలేఖనం, ఛాయాచిత్రకళలోనూ ప్రవేశం ఉన్న బహుముఖ ప్రజ్ఞాశాలి రామిరెడ్డి, ఎంతో కాలంగా కలలు కన్న స్వతంత్ర భారతాన్ని కేవలం 27 రోజులు మాత్రమే చూసి 1947 సెప్టెంబర్ 11న అస్తమించారు. నెల్లూరు గడ్డ మీద పుట్టిన ఈ సింహపురి సిరి, తెలుగు సాహిత్యంలో కవికోకిలగా చిరకాలం కమ్మని గానం వినిపిస్తూనే ఉంటుంది.

(సెప్టెంబర్ 11 - దువ్వూరి రామిరెడ్డి వర్ధంతి)



చల్లా చంద్రశేఖర్‌రెడ్డి
ఫోన్: 9440928666

## సీనియర్ న్యాయవాది..
# టీవీరావు కన్నుమూత



నెల్లూరుకు చెందిన సీనియర్ న్యాయవాది టీవీ రావు(65) ఈ నెల 8వతేదీ వేకువన గుండె పోటుతో మరణించారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో చికిత్సలు పొందుతూ నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. సుమారు నాలుగు దశాబ్దాలుగా ఆయన న్యాయవాద వృత్తిలో ఉన్నారు. పలు దినపత్రికలలో లీగల్ రిపోర్టర్‌గా పనిచేశారు. క్రమశిక్షణతో నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ ప్రముఖ న్యాయవాదిగా, పాత్రికేయునిగా ఆయన మంచి పేరు తెచ్చుకున్నారు. ఆయన మృతికి చింతిస్తూ రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ ఎస్.వెంకయ్య, మాజీసభ్యులు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, దేశాయిశెట్టి హనుమంతరావు, నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అయ్యపరెడ్డి, నాగరాజు, మాజీ ప్రధాన కార్యదర్శి రామిరెడ్డి రోజారెడ్డి, ఆలిండియా లాయర్స్ యూనియన్ నాయకులు బీవీ రమణారెడ్డి, లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నన్నేసాహెబ్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. పలువురు న్యాయవాదులు టీవీరావు స్వగ్రామమైన ముత్తుకూరు మండలం గోపాలపురంలోని వారి నివాసంలో ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

# తిరుమల తిరుపతి దేవస్థానములు

## శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ వారి ఆధ్వర్యంలో

## విపిఆర్ ఫౌండేషన్, నెల్లూరు వారి సౌజన్యంతో



వేలాది మంది భక్తులచే సామూహిక

# శ్రీ మహాలక్ష్మీ దీప పూజ

తేది : 11-09-2026 శుక్రవారం, సమయం : సాయంత్రం 4.00 గంటలకు

వేదిక : ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం, నెల్లూరు.

సహకారం... సౌజన్యం

విపిఆర్ ఫౌండేషన్

VPR FOUNDATION



శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గారు
పార్లమెంట్ సభ్యులు నెల్లూరు

శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గారు
కోవూరు శాసన సభ్యురాలు, టి.టి.డి. పాలకమండలి సభ్యురాలు

గమనిక : శ్రీమహాలక్ష్మీ దీప పూజలో పాల్గొనే భక్తులకు విజ్ఞప్తి ...

ఒక అడుగు దీపపు కుందె, పూజా సామాగ్రి కోసం పెద్ద పళ్లెం మరియు హారతి పళ్లెం తీసుకురాగలరు.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com